
అభ్యుదయ

మే 1978 వెల రూపాయి



తెలుగు
చలన చిత్ర
చరిత్రలో
ఒక మలుపు


పి.కోదండరామ రెడ్డి సమర్పించు

మృణాల్ సేన్ దర్శకత్వంలో

ఒక ఊరి కథ

ఈస్ట్‌మన్ కలర్

ఫొటోగ్రఫీ కె.కె.మహాజన్ నిర్మాత అల్లారెడ్డి పరంధామ రెడ్డి



నవయుగ

కాలనాళిక చిత్తశుద్ధి

భూమి మీద జీవోత్పత్తికి ముందరి దశల నుండీ చరిత్రనూ, పరిణా
మాన్నీ అన్వేషించి నిరూపించిన సమర్థతను మానవజాతి పెంపొందించుకుంది
బహు ముఖాలుగా, పలు శాస్త్ర సాధన సంపత్తితో, అగమ్య గోచరంగా వుండిన
సత్యాలు శతాబ్దాలుగా జరిగిన నిరంతర ప
శోధనల ఫలితంగా గ్రంథ స్తమై వున్నాయి. అంచేత
ప్రపంచ చరిత్ర కాని విశ్వ రహస్యాలు కాని యి
నాటి మనకూ, రానున్న కాలాల వారికీ తెలియ
కండా వుండిపోతాయేమో నన్న దిగులు అర్థరహితం.

ఈ అర్థరహితమైన 'దిగులు'తో, యిటీవల పదవీ విరమణ చేసిన భారత
ప్రభుత్వం ఒక అనర్థం తెచ్చుకుంది, అప్రతిష్ఠ పాలయ్యింది. రానున్న తరా
వారికి, స్వాతంత్ర్య సాధన తదుపరి చరిత్ర తెలియకండా పోతుందేమోనని
కాలనాళిక అన్నదానిలో, ఆ దశ చరిత్రను అది మూసపోసి భూస్థాపిత
చేసింది. ఆ చరిత్ర రచన ఎంత ఘనంగా సాగిందంటే – అరటిపళ్ల ఎగుమతులు
ఘరానా అశోకా హోటల్ నిర్మాణం చరిత్ర కెక్కవలసిన ఘనకార్యాలయ్యాయి
కాదనడానికి వీలులేని చిన్నవీ, పెద్దవీ లోపాలూ, తప్పులూ – యీ మూసపోసి
'చరిత్ర'ను తయారు చేసిన చరిత్రకారుడే అంగీకరించక తప్పనివి వెల్లడయ్యాయి

ఇటువంటి కాలనాళికను ఖననం చెయ్యడానికి పూర్వపు ప్రభుత్వం పూన
కున్నప్పుడు, తీవ్రాతితీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమయ్యింది. కాని అది లక్ష్యపెట
లేదు. ఆ నాళికలోని చారిత్రక సమాచారాన్ని వెల్లడించక, తన పనిని తాన
చేసివేసింది. ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అయ్యే అవకాశం వుంటుందని దాని
కలలోనైనా ఊహకందలేదు. ఒక తలమీద కుదురుగా వుంటుందనుకున
కిరీటం, యింకో తల మీదికి వచ్చింది. కొత్త ప్రభుత్వం, యీ తప్పుడు తడక
చరిత్ర కళేబరాన్ని, దాని అంత్యక్రియల కాలంలోని బాజాభజంత్రీలకు మించి
రొదతో తవ్వి బయటికి తీసి – కొండను తవ్వి ఎలకను పట్టుకున్నట్టుగా – ఒ
మహత్కార్యం సాధించాననుకొంది.

కాలనాళికను పాతి పెట్టినవారు, దానిని తవ్వి తీసినవారూ సమానంగా
ఆత్మవంచన చేసుకున్నారని చెప్పక తప్పదు. ఒకరు చేసింది ముందు తరా
వారికి చరిత్ర జ్ఞానం కలిగించడానికి కానట్టే, యింకొకరు చేసింది వారిని తప్పుడ
చరిత్ర నుండి రక్షించడానికి కాదు. సజీవులుగా వున్నవారి ప్రాథమికావసరా
నైనా తీర్చక, కాలక్షేపం చేస్తున్న పీడకవర్గాల ప్రతినిధులైన మహాశయులు
ఎప్పుడో పుట్టబోయే తరాలవారి హితం కోసమే యీ చేష్టలకు తల పడ్డారనీ, యి
విచిత్ర శుద్ధితో చేసిన పనులేనని నమ్మడం సాధ్యపడుతుందా?

సంచిక 5, సంపుటి 2 మే 1978 సాలుచందా, పది రూపాయ

దేవులపల్లి కృష్ణశాస్త్రి, నవ్యాంధ్ర సాహిత్యం మీద ఆయన ముద్ర

పాలగుమ్మి పద్మరాజు

ఈ తరం వారు ముదిసిన కృష్ణశాస్త్రినే ఎరుగుదురు.

మా తరం వారికి ఈ ముదుసలి రూపం వెనక 40-50 ఏండ్ల క్రితం మా మనస్సులలో ముద్రపడ్డ కృష్ణశాస్త్రి రూపం గుర్తువస్తూనే ఉంటుంది. ఒత్తు బిరుసు అయిన గిరజాలజుట్టు, వదులు లాల్చీ, కొంటె చూపులు చూసే చిన్న కళ్ళు, మెత్తగా విసిపించే కత్తి వంటి వాగ్ధోరణి, మృదుత్వంతో తీవ్రతను మేళవించిన గొంతు, వెటకారం, హాస్యం, లాలిత్యం కలగలిపిన సంభాషణా చాతుర్యం, ఇన్నిటికన్న కాల్పనిక కవిత్వంలోని అంద చందాలు అరటి పండొలిచినట్టు వివరించ గల నేర్పు భావకవితకు ప్రతి రూపంగా అయన – ఈ నాటికీ మీకు సాక్షాత్కరిస్తారు.

కొత్త కవిత్వం వ్రాయటమే కాదు, కొత్త కవిత్వానికి వేదిక కల్పించిన వైతాళికులలో కృష్ణ శాస్త్రి ముఖ్యుడు. ఆ రోజుల్లో, ఆయన కవితనే కాదు. ఆయన వేషభాషల్ని కూడా అనుకరించిన యువ కవులు కోకొల్లలు, అయితే ఒక ఆంగ్ల కవి అన్నట్టు, నిజమైన గొంతులు కొద్దిగానే ఉంటాయి, ప్రతిధ్వనులు చాలా ఉంటాయి. ఆయన అనుయాయులలో ఇంచుమించు అందరూ ఆయన కవిత్వంలోని పై మెరుగులే అనుకరించ గలిగారు గాని, అందులోని జిగి, శిల్ప సూక్ష్మాలు, లోతులు అందుకోలేక పోయారు. ఈ రకం భావ కవులను గురించి అయనే అపహసించారు:

మెరుగు కళ్లజోళ్ళు గిరజాలు సరదాలు
భావకవికి లేనివేవి లేవు
కవితయందు తప్ప గట్టి వాడ
న్నింట – అని.

అంతకు ముందు రాయప్రోలు వారి ఖండ కావ్యాలు కొన్ని ప్రచురించబడ్డా, కృష్ణ శాస్త్రిగారి 'కృష్ణపక్షము' 'ఊర్వశి' 'ప్రవాసము' వెలువడ్డ తరువాతనే, తెలుగునాట సాహితీ రంగంలో పెద్ద దుమారం చెలరేగింది. గడ్డు సాంప్రదాయ వాదులు దీన్ని ఏడుపు కవిత్వమన్నారు. యువ తరం దీనిని అతిలోకమైన కవిత్వం మన్నారు. భావ కవిత్వం ఉద్యమమయింది. పదలాలిత్యం, భావలాలిత్యం, ఆత్మాశ్రయత ఈ క్రొత్త కవిత్వానికి ఆత్మ. అయితే లలిత పద భావాల సంకలనం మాత్రమే గొప్ప కవిత్వం కాదు. ఏడుపు కవిత్వంలాగా కనిపించినా కృష్ణశాస్త్రి 'ఏడుపుకవిత్వము'లో, 'ఏడుపు' మామూలు ఏడుపు కాదు. దానికిలోతు, గాంభీర్యం ఉన్నాయి. దానిలో అహంకారం కూడా కలిసివుంది.

"నన్నుగని ఏరు జాలి జెందంగ
వలదు...
ఎవ్వరను కొంటిరో నన్ను ఏననంత

శోకభీకర తిమిర లోకైక పతిని''
వంటి ఖండ కావ్యాలలో ఎవరూ తీర్చ లేని వ్యధకు కవితా రూపం కల్పించ బడింది.

కృష్ణ శాస్త్రి రచనలు, ఖండ కావ్యాలు, గేయాలు, వ్యాసాలు ప్రసంగాలు ఏవి తీసుకున్నా, వాటిలో అపురూపమైన శిల్పం కనిపిస్తుంది. కాళిదాసు మొదలు తిరుపతి వేంకట కవుల వరకు సాంప్రదాయకంగా వచ్చిన కవితా శిల్పం జీర్ణం చేసుకొని దాన్ని ఆధునిక మనస్సును ఆకర్షించే మూసలో పెట్టగల సామర్థ్యం కృష్ణ శాస్త్రికి ఉంది.

''రేగు కోర్కుల గుత్తి నా గుండెవల ఎఱ్ఱ
ఎఱ్ఱనైనది మావి ఇగురు గుబురు''
వంటి పద చిత్రాలు ఏ కాళిదాసునో తలపింప జేస్తాయి. నవ్యతతోపాటు పారాతన్యంలోని గాంభీర్యం, బరువు ఆయన రచనలలో ప్రతిఫలిస్తాయి.

కృష్ణ శాస్త్రికీ, ఆయన సమకాలీన కాల్పనిక కవులకూ ఒక భేదం ఉంది. మిగిలిన వారందరూ కాల్పనిక కవిత్వం దగ్గ రేఆగిపోయారు. కృష్ణ శాస్త్రి ఆ శ్రేణి దాటి ఎంతగానో పెరిగారు. 80 ఏళ్ల వయస్సులో ఇంకా పెరుగుతూనే ఉన్నారు. దీనికి కారణాలు రెండు మూడు ఉన్నాయి. సాంప్రదాయక సంస్కృతాంధ్ర సాహిత్యం తోనే కాక ఆయనకు ఆంగ్ల, బెంగాలీ సాహిత్యాలతో సాన్నిహిత్యం ఉంది. అంతేగాక సర్ రఘుపతి వేంకటరత్నంగారి అంతేవాసిగా ఆయన సూఫీ, అరబిక్, పర్షియన్, కవితా సూక్ష్మాలు జీర్ణం చేసుకున్నారు.

మరొక ముఖ్యవిషయం – సామాన్యంగా అందరూ ఆయనలో గుర్తించనది. ఆయన రెండు భిన్న ప్రవృత్తుల సంయమనం. ఆయనలో భావనాలోకాలలో విహరించే కవీ ఉన్నాడు, వాస్తవ లోకంతో ఆత్మీయమైన అనుబంధంఉన్న లోకజ్ఞుడు చిత్రంగాకలిసి వున్నారు. కాల్పనిక కవిత్వపు రోజుల్లో మొదటి వ్యక్తి ప్రముఖ పాత్ర వహించారు. ఆయనలోని లోకజ్ఞుని స్వయంవ్యక్తీకరణానికి దోహదం చేసినది ఆకాశవాణి. ఆకాశవాణి ఆయన చేత అనేక విషయాలపై ప్రసంగ వ్యాసాలు వ్రాయించింది. ఆ వ్యాసాలు తెలుగు వచన రచనలో తలుమానికాలు, అందులోనూ విశిష్టమైన రచనా శిల్పం, జీవితం యెడల మానవ లోకం యెడల ఆసక్తి, ఇష్టం, ఎన్నో కనబడతాయి. సుబ్బమ్మవ్వ, రిక్షావలా, ఇద్దరు సత్యవాదులు. బహుకాల దర్శనంవంటి రచనలలో సున్నితమైన హాస్యం, వివిధ ప్రవృత్తులు గల మనుష్యుల యెడల సానుభూతితో కూడిన ఇష్టం కనబడతాయి. ఈ ప్రసంగ వ్యాసాలలోనే మరొక తరహా రచనలున్నాయి. అవి గతాన్ని వర్తమానంతో పోల్చి, అంచనా వేసి, తూచి చెప్పేవి. వీటిలో గతాన్ని కళ్ళకు కట్టినట్టు చిత్రించుచారు కృష్ణ శాస్త్రి.– ఇందులో కొన్ని కేవలం కాల్పనికాలు 'అప్పుడుపుట్టిఉంటే', 'పుష్పలావికలు' వంటివి. కొన్ని ఆయన చిన్నతనంలో

చూసిన దృశ్యాల చిత్రీకరణ – 'కోవెల–కొలను', 'మాపూరి వీధి అరుగు', 'మావూరు పోయింది' వంటివి చదువుతూంటే; అయ్యో ఇవన్నీ పోయాయే అనిపిస్తుంది. అయితే ఆయన రచనల్లో దేనిలోనూ పోయినదాన్ని తలుచుకుని ఏడవడం గానీ, వర్తమానాన్ని చూచి అసహ్యించుకోవడం గాని లేదు. మార్పు సహజమనీ, అవన్నీ పోవడం తప్పదనీ, కొత్తవి వచ్చి తీరతాయనీ, అయినా పోయిన వాటిని తలుచుకుని రవంత బెంగపెట్టుకోవడం మనిషి స్వభావం లోనే ఉందని, ఆయనకు తెలుసు. ఆయనకు తెలుసునన్న విషయం ఆయన చెప్పకుండానే, ఆ రచనల్లో ప్రతిఫలిస్తుంది.

ఆయనలోని లోకజ్ఞత, కాల్పనికత, పరిపూర్ణ వికాసం పొంది, కలిసిపోయి, సృష్టించినవి రేడియో నాటికలు. శ్రవ్య నాటిక ఒక విశిష్టమయిన సాహిత్య రూపంగా పరిణతి చెందింది ఆయన కలంలో. ఇవి ఆయన తెలుగు సాహిత్యానికి అర్పించిన విశిష్టరూపాలని నా నమ్మకం. వీటిలో ఆయన సృష్టి పరాకాష్ట నందుకుంది. 'దక్షయజ్ఞము', 'సాయుజ్యము', 'ధనుర్దాసు', 'ఆండాళ్' 'విప్రనారాయణ', 'క్షీర సాగర్ మథనం', వంటివి ఒకపక్క, 'ఏడాది పొడుగునా', 'వేణుకుంజం' వంటివి మరొక పక్క కాలం దేశాలను అధిగమించి అపురూపమైన శ్రవ్య చిత్రాలను మన యెదుట సాక్షాత్కరింప జేస్తాయి. వెనుకటి కాల్పనిక కవిత్వంలో కన్న ఈ రచనలలో గేయరచన ఎన్నో కొత్త మెలకువలు సంతరించుకుంది. వీటిలోనే కాదు, రేడియోకోసం ఆయన వ్రాసిన ఈమాసపు పాటలలో, పిల్లల పాటలలో ఎన్నో చిత్రమైన కొత్త పోకడలు కనిపిస్తాయి. పదాలలో, పద చిత్రాలలో, ఎంతో వైవిధ్యం, వైశాల్యం ఉన్నాయి ఈ గేయాలలో. భక్తిగీతాలలో కూడా ఎన్నో చిత్రమయిన పోకడలున్నాయి.

"తన కంఠమున దాచి హాలాహలం –
"తలనుండి కురిపించి గంగాజలం
మనిషి శివుడవడమే గాంధిమతం"

వంటి పలుకుబడులు – వినాయకుణ్ణి ఉద్దేశించి పిల్లలు –

'బలే ఎలుక సవారీ ఎలా ఎక్కుతావో
చలో అంటు ప్రతీ ఇంట ఎలా తిరుగుతావో' – పాడుకుంటున్నప్పుడు

వాళ్ల మనస్సుల్లో గణపతితో ఉన్న చనువు, కులాసా భక్తి ఎలా వ్యక్తమవుతాయో – అది వింటున్నప్పుడు శ్రోతల మనసుల్లోకి సూటిగా ఎక్కిపోతాయి. ఇవేగాక రోడ్డు రోలర్‌లాగే కూలీల పాటల్లో, 'కొత్త కోవెల'లో ఆధునిక జీవితంలో యంత్ర ప్రభావానికి సంబంధించిన నిజాలు చాలా అద్భుతంగా వ్యక్తీకరించారాయన. హైదరాబాదు నగర జీవితాన్ని కొన్ని గేయాలలో – కళ్ళకు కట్టినట్టు చిత్రీకరించిన రేడియో రూపకం నాకు ఎన్నటికీ మరుపురాదు. ఆ రూపకం ప్రారంభం లోనే 'అహిస్తా అహిస్తా చౌరాస్తా
చౌరాస్తా

ఏక్ సవారీ చార్ అణా
దో సవారీ చే అణా'

వింటుంటే, హైదరాబాదులో రిక్షావాలా సాక్షాత్కరిస్తాడు. ఉరుదూ పదాల సంయోగంతో హైదరాబాదు వాసన, రంగు, రుచి, ఆ గేయాలకు సంతరించ గలిగిన నేర్పు, శిల్పచాతురి ఆయన సొమ్ము.

80 ఏండ్ల వయస్సులో ఇంకా అయన పెరుగుతున్నారని అన్నాను. అందుచేత ఆయన కవితామూర్తికి ఆఖరు అంచనా వేయడం ఇప్పుడు సాధ్యం కాదు. ఈ మహా పద శిల్పి కలంనుంచి ఇంకా ఏ కొత్త పోకడలు వెలువడతాయో.

ఆయన గొంతు పోయి 15 ఏళ్లయింది. కాని మరో గొంతు మరింత సున్నితంగా పలుకుతోంది. దానికి జోహారులు.

ప్రశ్న

పసుపులేటి రామారావు

చీకటి !
నేలనుండి నింగిదాకా
కారు చీకటి !
చుక్కలు బిక్కు బిక్కు
మంటున్నాయి...
నేలతల్లి వెక్కి వెక్కి
ఏడ్చుతోంది...
కొంపా గోడూ
మింగిందా చీకటి !
చెమట ధారల్ని
త్రాగి బలిసిందా చీకటి?
అడుగో...
నీరసంగా ...
ఆయాసంతో
అడుగులేస్తూ —
శవాకారంలా,
సగం మనిషిలా —
దిష్టి బొమ్మలా
చావలేక బ్రతుకుతూ,
బ్రతుకోసం ఏడుస్తూ,
అడుగులేస్తున్నాడు కాని
చేతిలోని అగ్గిపులను
అంటించడేం ?
ప్రక్కనున్న నా చేతిని
అందుకోడేం ? ?

పులిస్తరాకు

వేగ్రిమ్‌శిల

ఆకాశపు అంచుల్లో నిలబడి
చందనం పూసుకున్న చంద్రుణ్ణి
పలకరించు -
వెలయాలి చీరచెంగుల్లో దూరి
కాటుక పెట్టుకున్న కళ్లని ముద్దు
పెట్టుకో -

నేను మాత్రం
పేదవాడి పగిలిన గుండెల్లోకి ప్రాకి
ఆకలితో దించుకు పోయిన
కడుపును కావలించుని గోడవతల
పారేసిన పులిస్తరాకులోని
ఎంగిలి మెతుకుల్ని ఏరుకుతింటా.

అమరగాయకుడు పాల్ రాబ్సన్

కాట్రగడ్డ గంగయ్య

పాల్ రాబ్సన్ మహానటుడు. గొప్ప గాయకుడు. రెండేళ్ల క్రితం ఆయన ఫిలడెల్ఫియాలో మరణించేరు.

రంగు జాతుల విమోచనకూ, ప్రపంచ శాంతికీ, వివిధ దేశాలమధ్య స్నేహ సహకారాల వ్యాప్తికీ ఈ మహనీయుడు జరిపిన కృషి జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఆయన జన్మదినోత్సవం జరపాలని ప్రపంచ శాంతి వుద్యమం నిర్ణయించింది.

1898 ఏప్రిల్ 9న ఈయన అమెరికా లోని ప్రిన్స్టన్‌లో జన్మించారు. అమెరికా దక్షిణ ప్రాంత రాష్ట్రాలలో నీగ్రోలను పెట్టే బాధలనుంచి తప్పించు కొనేందుకై ఆయన తండ్రి ఉత్తర రాష్ట్రాలకు తరలి వచ్చారు. కాని, అక్కడా యీ బాలునికి తిప్పలు తప్ప లేదు.



రాబ్సన్‌కు చదువంటే అమిత ఆసక్తి, అయితే అమెరికాలో చదువు ఎంతో ఖర్చుతో కూడిన పని. చదువుమీద ఆసక్తితో దొరికిన పనల్లా చేసి ఎంతో కొంత సంపాదించేవారు. మండు టెండల వేసవిలో పొల్లోలా పని చేయడం, పైసలు కూడ బెట్టి శీతాకాలంలో చదువు. పళ్లాలు కడిగీ, ప్లేట్లు తుడిచీ, సామానులు మోసీ - చదువు సాగించేరు.

ప్రథమ శ్రేణిలో కృతార్థుడై, స్కాలర్‌షిప్ సంపాదించి, కళాశాలలో ప్రవేశించారు. తదుపరి పోటీ పరీక్షలు నెగ్గి, 5 సంవత్సరాలపాటు విద్యార్థి వేతనం సంపాదించేరు. ప్రఖ్యాతి పొందిన రుట్‌గర్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయ శాస్త్రంలో ఆనర్సు డిగ్రీ తీసుకొన్నారు.

ఎంతో తెలివీ, నైపుణ్యం వున్నా రాబ్సన్‌కు న్యాయవాదిగా ప్రాక్టీసు చేసే అవకాశం లభించలేదు. కారణం - ఆయన నీగ్రో. అందుచేత రంగస్థల నటుడుగా జీవనోపాధి సంపాదించు కొనడానికి ఉద్యమించారు.

నీగ్రోజనాభా అధికంగావుండే హార్లెమ్‌లో (న్యూయార్కు నగరంలో భాగం) 1924 లో యిందుకు ప్రారంభం జరిగింది. యూజినీ ఓనీల్ అనే ప్రఖ్యాత రచయిత నాటకాలు రెండింటిలో ఆయన నటించి, బాగా రాణించేరు. మరుచటేడు గాయకుడుగా కూడ పేరు వచ్చింది. ఇంక జీవితం సాఫీగా నడవగలదనిపించింది.

కాని, రంగు జాతుల మీద చూపే వివక్షత భయంకర రూపం తీసుకొంది. గత్యంతరం లేక ఆయన దేశాన్ని వదిలి యూరప్‌కు వెళ్ళవలసివచ్చింది.

ఆ వెళ్లడం వెళ్లడం 11 ఏళ్లపాటు (1928 – 1939) విదేశాలలోనే గడిపారు. నటుడుగా, గాయకుడుగా అంతర్జాతీయ ప్రఖ్యాతి సంపాదించారు. లండన్‌లో 'ఒథెల్లో' గా నటించి అందరి మన్ననలు పొందేరు. పారిస్, ప్రాహా, వియన్నా మొదలైన నగరాలలో నటుడుగా, గాయకుడుగా పేరుతెచ్చుకొన్నారు.

1934 లో ప్రఖ్యాత సోవియటు సినీ దర్శకుడు ఐసెన్‌స్టీన్ ఆహ్వానంపై రాబ్సన్ మొట్టమొదటి మారు సోవియటును సందర్శించేరు. అది ఆయన జీవితంలోనే ఎంతో ముఖ్యమైన మలుపు.

అప్పటికింకా సోషలిస్టు వ్యవస్థకింకా మైనారిటీ తీరనేలేదు. 14 సామ్రాజ్య వాద దేశాలు జరిపిన దండయాత్రలను తిప్పికొట్టి, నూతన వ్యవస్థను సమష్టి కృషితో నిర్మించు కొంటూండడం చూచి ముగ్ధుడయ్యారు. తమ నీగ్రోలలాగే ఎంతో వెనుకబడి వుండిన ఉజ్బెకులు, తార్తారులు, తదితర ఆశియా ప్రాంత ప్రజ నిరక్షరాస్యతను తొలగించుకొని, తమ బిడ్డలను గొప్ప కళాకారులనుగా, శాస్త్రవేత్తలనుగా తయారు చేసుకొనేందుకు ఆ మండలాలలో ఏర్పరచుకొన్న అవకాశాలు ఆయననెంతో ఆశ్చర్యపరచేయి. ఎటువంటి విదక్షతా చూపకుండా అబాల వృద్ధం తనను హృదయ పూర్వకంగా అభిమానించడం ఆనందపరచింది. తానింతకాలం కన్న కలలు, తన నీగ్రో ప్రజ కూడా, తోటివారితో సాటిగా జీవించాలని కన్నకలలు నిజమయ్యే అవకాశాలున్నాయని ఈ నూతన వ్యవస్థ ఆచరణలో చూపింది.

ఆ పర్యటన గురించి రాబ్సన్ ఇల్లా అన్నారు : ''నేనూ మనిషినే, నన్నా తోటి మానవులు కూడా మనిషిగా పరిగణిస్తున్నారని ప్ర ప్రథమంగా భావించ గలిగింది ఈ సోవియటు దేశంలోనే.''

సోవియటుకు వెడుతున్నప్పుడు ఆయన ప్రయాణిస్తున్న రైలు బెర్లిన్‌లో ఆగింది. కొన్నిగంటల వ్యవధివున్నదన్నారు. పట్టణంలోకి పోయివద్దామని ఆయన రైలు దిగేరు. ప్లాట్‌ఫారం మీద పదడుగులు వేయకుండానే ఆయనను ఫాసిస్టు రౌడీ మూకలు చుట్టుకొన్నాయి. కేకలు, బూతులతో తమ జాతి ఔన్నత్యాన్ని చాటుకొన్నారు. రాబ్సన్ తన ట్రైలోకి తిరిగి పోయేరు. హిట్లరు అధికారంలోకి వచ్చి అప్పటికి ఒక ఏడాది దాటింది. ఫాసిజం తాండవ నృత్యాన్ని కళ్లారా చూసి, అనుభవించిన రాబ్సన్‌కు అదొక మరువరాని సంఘటనగా మనసులో నిలిచి పోయింది. విమోచనోద్యమాలకు అండగా వుండాలనే దృఢ సంకల్పం ఏర్పడింది.

1936 లో స్పెయిన్‌లోని రిపబ్లికను ప్రభుత్వంమీద ఫ్రాంకో ఫాసిస్టు తిరుగుబాటుకు హిట్లరు, ముస్సోలినీలు ప్రత్యక్ష సహాయం ఇచ్చేరు. తటస్థ విధానం

ముసుగులో బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా ప్రభుత్వాలు స్పానిష్ ప్రజలకు ద్రోహం చేశాయి. కాని ప్రపంచ ప్రజల సానుభూతి రిపబ్లికను ప్రభుత్వం యెడనే. అనేక దేశాల నుంచి వాలంటీర్లు వెళ్లి ఇంటర్నేషనల్ బ్రిగేడ్‌గా ఏర్పడి యుద్ధరంగంలో రక్తం ధారపోసేరు. పలువురు ప్రజా నాయకులు స్వయంగా వెళ్లి ఆ ప్రభుత్వానికి తమ నైతిక వత్తాసునిచ్చేరు. జవహర్లాల్ నెహ్రూ, కృష్ణ మీనన్ అలావెళ్లిన వారిలో వున్నారు. పాల్‌రాబ్సన్ ఆ ప్రజలనూ, వివిధ దేశాలనుంచి వచ్చిన వాలంటీర్లనూ తన పాటలతో ఉత్తేజ పరచారు.

1939 – 1940లో రాబ్సన్ అమెరికాకు తిరిగి వెళ్లేరు. రంగు జాతులు తమ హక్కుల కోసం జరిపే పోరాటానికి సాంస్కృతిక కార్యక్రమాలతో చేయూత నిచ్చేరు. యువగాయకులకూ, నటులకూ ప్రోత్సాహ మిచ్చారు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికాలో విస్తరిల్లిన ప్రచ్ఛన్న యుద్ధ సర్పాలు మళ్లా రాబ్సన్ మీద పడగవిప్పేయి. ఆయన సాంస్కృతిక కార్యక్రమాల మీద ఎన్నో ఆంక్షలు పెట్టేరు. రికార్డింగ్ కంపెనీలు కంట్రాక్టులు యివ్వకుండా, ప్రదర్శనకు హాల్స్ యివ్వకుండా, దిగ్బంధం చేశారు. అయినా ఆయన జంకలేదు. పార్కులలోనూ, వినోద విహార స్థలాలలోనూ ప్రజలందరికీ అందుబాటుగా ఆయన ప్రదర్శనలిచ్చేరు.

1949 ఆగష్టు 27 న పీక్‌స్కిల్ అనే చోట ఫాసిస్టు దళాలు పథకం ప్రకారం ఆయన ప్రదర్శన మీద దాడిజరిపి, కార్యక్రమం సాగకుండా చేశారు. మరునాడు ఆ ప్రాంతప్రజలు 1500 మంది సమావేశమై ఆ దౌర్జన్యానికి నిరసన తెలిపేరు. మరుసటి ఆదివారంనాడు అదే స్థలంలో రాబ్సన్ తన ప్రదర్శన నివ్వడానికై ఆహ్వానించేరు. కూ క్లక్స్ క్లాన్, అమెరికన్ లీజియన్ మొదలైన అభివృద్ధి నిరోధక మూకలన్నీ పెద్దఎత్తున ప్రచారం ప్రారంభించి, ఈ కార్యక్రమం జరగనీయ మని ప్రతిన పట్టాయి. రేడియో, పత్రికలూ పూర్తి మద్దతు నిచ్చేయి.

అయినా 1949 సెప్టెంబరు 5 న 20 వేలకుపైగా ప్రజలు పలుప్రాంతాలు నుంచి పీక్‌స్కిల్ వచ్చేరు. రంగు జాతులవారూ, శ్వేత జాతులవారూ 1500 మందికి పైగా (కార్మికులూ, విద్యార్థులూ) వాలంటీర్లగా పనిచేశారు.

సరిగ్గా మధ్యాహ్నం 2 గంటలకు, చెప్పిన సమయానికి రాబ్సన్ పాట ప్రారంభించారు, చుట్టుపక్కలనుంచి వచ్చి దాడులు సాగించిన రౌడీ మూకలకు వాలంటీర్లు తగిన శాస్తి చేశారు. రాబ్సన్ కార్యక్రమం నిర్విఘ్నంగా సాగింది.

ఈ వార్త ప్రపంచమంతటా వ్యాపించింది. రాబ్సన్ ఖ్యాతి యినుమడించింది. అమెరికన్ ప్రభుత్వం రెచ్చిపోయింది. ఆయన పాస్‌పోర్టును రద్దు చెయ్యగల అ విధంగా వివిధ దేశాల ప్రజలకు అయనను అందుభాటు కాకుండా చేసింది.

1950 లో వార్సాలో జరిగిన ప్రపంచ శాంతి మహాసభలో పాల్గొన్న భారత

పతినిధి వర్గ సభ్యుడుగా నా అనుభవాన్ని ఈ సందర్భంలో చెప్పడం అసమంజస కాదు. ఆ సభలకు రాబ్సన్ రాగలరా, ఆయన గానాన్ని వినగలమా అ ఆందోళన చెందాము. మేమే కాదు. ప్రతినిధులందరిలో అదే భావం. హఠాత్తుగ ఓ రోజున అధ్యక్షవర్గ సభ్యుడొకరు శుభవార్త వినిపించేరు. రాబ్సన్ స్వయంగ రాలేకపోయినా, తనప్రసంగాన్నీ, పాటలనూ రికార్డుచేసి పంపేరనీ, వాటి సభకు వినిపిస్తారనీ చెప్పేరు. అప్పుడు వినవచ్చిన కరతాళధ్వనులూ, వెల్లివిరిసి వుత్సాహమూ వర్ణనాతీతం.

మరో పదేండ్ల తరవాత 1957లో లండన్‌లో, పాంక్రాస్ హాలులో రాబ్స కచేరీ జరిగింది. హాలులోనూ, బయటా కూడ జనసందోహం నిండిపోయింది వేల మైళ్ల దూరంలో, తన యింట్లో కూర్చుని రాబ్సన్ పాడుతూంటే ఆ పాట టెలిఫోన్ మీదుగా లండన్‌కు ప్రసారమయాయి.

8 ఏండ్లపాటు అమెరికను ప్రభుత్వం తన నిర్బంధ చర్యలను అమల జరిపింది. కాని ఆ దేశం, ప్రపంచం అన్ని మూలలనుంచీ వచ్చిన ఆందోళ ముందు చివరకు తలవంచక తీరలేదు. 1958 లో రాబ్సన్‌కు మరల పాస్‌పో ఇచ్చేరు. రంగు జాతులవారు తమ హక్కుల పోరాటంలో సంపూర్ణ విజయ శాశ్వత విజయం సాధించాలంటే రంగు భేదం చూడకుండా కార్మికవర్గంతో కలి కృషి చెయ్యాలని ఎంతో దూరదృష్టితో ఆయన ఉద్బోధించారు. ఈ పోరాటాలక అంతర్జాతీయ సహకారమూ, సామరస్యమూ ఎంతో అవసరమని వివరించేరు.

ఈ అమర గాయకుని, ప్రపంచ శాంతి యోధుని కృషి ప్రపంచ ప్రజలంద ముఖ్యంగా ముందు తరాల వారికి అందుబాటులో వుంచాలని 1965 లో రాబరి ఆర్కైవ్స్' ఏర్పరచబడింది. జర్మన్ ప్రజాసామ్య రిపబ్లికు రాజధాని బెర్లిన్సలో ఆయన పాటల రికార్డులు, టేపులు, ఫోటోలు, పత్రికలు, పుస్తకాలు, ఆయన ఎరిగినవారు లిఖిత పూర్వకంగానో, టేపుల మీదనో యిచ్చిన జ్ఞాపకాలు ఉత్తరాలు, పోస్టర్లు, ప్రోగ్రాం కరపత్రాలు మొదలయిన వానిని ప్రపంచమంత నుంచీ సేకరించి భద్రపరుస్తున్నారు. అలా సంకలనం చేయబడిన వానిలో మ దేశంలో ప్రచురించిన వ్యాసాల కాపీలు, గ్రామఫోన్ రికార్డులు కూడ వున్నాయి

అంతే కాదు. ఆయన జీవితం గురించి, కృషిని గురించి విశేష ప్రబోధం జరు తూంది. ఆయన పాటల రికార్డులను పెద్ద ఎత్తున తయారుచేసి అందరికీ అం బాటులో వుంచారు. రేడియో, టెలివిజన్‌లతో వీటికి ఎంతో వ్యవధి నిస్తూన్నార సమావేశాలు, గోష్ఠులు, చర్చలు ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు వెయ్యిమంది విద్యార్థులు చదువుతున్న ఒక పెద్ద పాఠశాలకు ఆయన పేరు పెట్టేరు.

రాబ్సన్ మనమధ్యలేరు, కాని, ఆయన కృషి చిరస్థాయిగా నిలిచిపోయింది ఆయన పాటలతో ఆ గొంతు ఎన్నటికీ వినిపిస్తూనే వుంటుంది, ఇందుచేతనే త పాట తన ఆయుధమన్నారాయన.

కథానిక

మంచి నడత గల కుక్క

కవన శర్మ

అందమైన బంగళాలో ఉన్న షెడ్డులోంచి డ్రైవరు అందమైన కారు బయటికి తీసాడు. ఆ కారుకున్న తెరలు, డ్రైవరు భార్య పెళ్లిళ్లకి, పేరంటాలకి వెళ్లేటప్పుడు కట్టుకొనే మంచి చీర కంటే కూడా చక్కగా, నాజూకుగా ఉన్నాయి. కారుని బయటికి తీసాక మరోసారి దాన్ని తుడిచాడు. నిగనిగ లాడుతున్న కారు మరింత నిగనిగ లాడింది. సీట్లు మరోసారి దులిపాడు. కారుని అల్లా దులిపి తుడిచి, డ్రైవరు తృప్తి పడ్డాడు. ఆ కారులో ఏ మాత్రం దుమ్మున్నా మాసిపోయే అంత అందంగా, తెల్లగా ఉంటుంది, ఆ యింటి యజమానురాలు సుజాత. ఆమె బట్టలు టినోపాల్ ఎడ్వర్‌టైజ్‌మెంటులాగా తెల్లగాను, అప్పుడే కురిసిన మంచు అంత పరిశుభ్రంగాను ఉంటాయి.

సుజాతకి పరిశుభ్రత మీద వెర్రి వ్యామోహం ఉంది. అది పాటించేందుకు కావల్సిన డబ్బు, తీరుబడి ఉన్నాయి. భర్తకి పెద్ద కంపెనీ ఉద్యోగం ఉంది, ఆ కంపెనీ వాళ్లిచ్చే పెద్ద బంగళాని అందంగా; శుభ్రంగా ఉంచుకోగలందులకు ఆ కంపెనీ ఇచ్చిన నౌకర్లున్నారు.

ఆ రోజు సుజాత అందంగా తయారై అందమైన కార్లో బయల్దేరుతున్నది, ఆ నౌకర్లలో ఒకడైన నర్సింపులింటికి. నర్సింపులింటికి సుజాత బయల్దేరిందంటే దానికో పెద్ద, ముఖ్యమైన కారణం ఉంది. ఆ కారణం పేరు జేన్. జేన్, సుజాత ప్రాణంగా పెంచుకొంటున్న కుక్క.

జేన్ మంచి అలవాట్లున్న కుక్క. ఆ మంచి అలవాట్లు సుజాత నేర్పించింది. సుజాతకున్న యిద్దరు పిల్లలు మంచి నడవడి నేర్పే ఖరీదైన స్కూళ్లలో దూరంగా ఉన్న ఊళ్లలో చదువుకొంటున్నారు. సుజాతకు పిల్లలు తన దగ్గరుండి చదువుకునే రోజుల్లోనే తోచేది గాదు. పిల్లలు దూరంగా ఉండటంతో తనకి తోచడం లేదన్న విషయం ధైర్యంగా అందరికి చెప్పుకొని సానుభూతి సంపాదించింది.

అందరు తలా కొంచెం సానుభూతి, తలకొక సలహా ఇచ్చారు. అందులో సుజాతకి నచ్చిన సలహా, విశ్వాసపాత్రమైన కుక్కని పెంచడం. కుక్కలు పిల్లల కంటె ఎక్కువ అపేక్ష చూపిస్తాయని సుజాత అందరూ అనుకోగా వింది. అందుకని ఒక ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్న డాక్టర్‌గారి దగ్గర కొన్ని వందలు పోసి జేన్‌ని కొంది. అమ్మిన డాక్టరు ఆ కుక్కపిల్లకి మంచి అలవాట్లు ఎల్లా నేర్పాలో సుజాతకి బోధపర్చాడు. కుక్కల యజమానులైన స్నేహితులు కొందరు పొద్దున్నే కుక్కని అల్లా వీధిలో తిప్పుకొని వస్తే, యిల్లు గలీజు

చెయ్యదని స్వానుభవంతో చెప్పారు. సుజాత ఆ డ్యూటీ నర్సింహులుకి వేసింది. నర్సింహులా బంగళాలో నౌకరు.

రోజూ జేన్‌ని అల్లా బయట తిప్పి తీసుకొని వచ్చే నర్సింహులా రోజు రాలేదు. జేన్ కాలు కాలిన పిల్లిలాగా, బయటకు పోవాల్సిన కుక్కలాగా ఇల్లంతా తెగ తిరిగింది. సుజాతకి దాని బాధ అర్థమైంది. అర్థమై డ్రైవరు రాగానే దాన్ని అల్లా తిప్పి తీసుకు రమ్మంది. జేన్‌కి డ్రైవర్ని చూస్తే వెళ్ళాలనిపించే షికారు వేరు. ఆ షికారుకి సుజాతతో, కారు వెనక సీట్లో నిలబడి మెడ కిటికీ లోంచి కొంచెం బయటికి పెట్టి ఠీవిగా వెళ్తుంది. అందుకని డ్రైవరు పటకా పుచ్చుకొని రమ్మని లాగినా అది కదల్లేదు సరికదా విసుక్కున్నట్టుగా మొరిగింది. పోనీ కారులోనే దూరంగా వెళ్తుందను కొంటే సుజాత లేకుండా వెళ్ళను గాక వెళ్ళనంది. జేన్ అలవాట్లు అలాంటివి మరి. డ్రైవర్తో వెళ్తే యజమానురాలి తోడు లేనిదే వెళ్ళదు. అలవాటైన చోటికి వెళ్తేగాని అవసరాలు తీర్చుకోదు.

సుజాత జేన్ నడతకి, క్రమశిక్షణకి తెలివితేటలకి మురిసిపోయింది.

జేన్, కారు డ్రైవరు వెనక తలుపు తెరచి పట్టుకోగానే మెత్తగ పరుగెత్తి అందమైన జూలు కళ్లమీద పడ్తుండగా ఎగిరి సీట్లో నిలబడింది. మళ్లీ కార్లోకి ఎగిరింది, ఎగిరే ముందు తనని షాలో అవమని సుజాతని బతిమాలింది. సుజాత దాని తెలివితేటలకి మరోసారి మురిసిపోయి కారు నాజూకుగా ఎక్కింది. డ్రైవరు శబ్దం కాకుండా తలుపు వేసాడు. కారు రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న నర్సింహులింటికి దూసుకు పోయింది.

సరిగ్గా ఆ సమయంలో నర్సింహులు పెళ్ళాం అయిదేళ్ళ కూతుర్ని కేకలేస్తోంది. "ఏంటంటావ్? ఉన్నది ఒక్కటే దొడ్డి. ఆగలేకపోతే రోడ్డు పక్కగా ఎళ్లు ఎంతమంది ఎళ్తున్నారుగారూ? నువ్వేం దొర్సానివా? లోపలగాని యెళ్ళనంటావా? అయ్యొచ్చే వరకు ఆగు. లోపలి కెళ్ళిన మనిషిని కాసేపు నిదానంగా కూర్చోనీయకపోతే ఎల్లా?"

ఆ చిన్నది తల్లి కేకకి దడుసుకొని సిగ్గును జయించి వీధిలోకి నడిచింది గౌను పైకి పట్టుకొని. సరిగ్గా అదే సమయాని ఎదురింటి చిన్ని, పక్కింటి కిష్టుడు, అక్కడే ఉన్నారు కూర్చుని. నర్సింహులి కూతురు వాళ్ళ పక్కన జేరింది.

సూజత కారు ఆ వీధిలోకి వచ్చింది. వీధిలో పారుతున్న మురుగు కాలవ నుంచివచ్చే దుర్గంధం ముక్కులు బద్దలు చేస్తోంది. వీధిలో బారులు తీర్చికూర్చున్న పిల్లల్ని చూచి, వీళ్ళకంటే జేన్ నయం అనుకొంది. నేర్పితే కుక్కకైనా మంచి నడత వస్తుంది కదా! మరి మనుష్యులెందుకు నేర్పరో వాళ్ళ పిల్లలికి! బహుశః వాళ్ళకే మంచిఅలవాట్లు ఉండి ఉండవు. వాళ్ళేం నేర్పుతారు!

డ్రైవరు కారుని నర్సింహులింటి ముందు ఆపి నర్సింహుల్ని పిలిచాడు. నర్సింహులి కూతురులేచి అయ్యని పిలవడానికి లోపలకి పోయింది. వచ్చింది. సాక్షాత్తు యజమానురాలు కావటంతో నర్సింహుల భార్య లోపలున్న భర్తను

పిలవక తప్పలేదు. నర్సింవులు బయటకు వచ్చి సంగతి తెలుసుకొని వీధిలోకి వచ్చాడు. సుజాత "ఇవాళ ఎందుకు రాలేదు? జేన్ పొద్దున్న నుంచి నీకోసం ఎదురు చూస్తోంది" అంది కోపంగా.

"ఇయ్యాల కొంచెం కడుపులో నొప్పిగా ఉంది. బేదులవుతున్నా య్యండమ్మగారు!" అని మనవి చేసు కొన్నాడు నర్సింవులు. అతడిని చూస్తూనే కార్లోని కుక్క బయటికి దిగింది నర్సింవులు దాని వెంట నడిచాడు.

అది చిన్ని, కిష్టుడు కూర్చున్న చోటకి పోయి గొయ్యి తవ్వి తన పని కానిచ్చి ఠీవిగా వెనక్కి వచ్చింది. నర్సింవులు అమ్మగారు కుక్కని బయ టకు తీసుకు పొమ్మనప్పుడల్లా తన యింటి కేసి తీసుకు పోయి తన పెళ్లాం పిల్లల్ని పలకరించి వస్తాడు. జేన్‌కి అందుకని నర్సింవులింటి దగ్గర కాల కృత్యాలు తీర్చు కొనే అలవాటైంది. లేక సుజాత యింటికి దూరంగా పోయే మంచి అలవాటైంది:

పని ముగించు కొన్న జేన్ నర్సిం వుల్ని నిర్లక్ష్యంగా చూసి కారెక్కింది. కారు బయల్దేరింది. సుజాత నర్సింవు లింట పరిసరాల్ని వదలి వెళ్ళి "ఛీఛీ! ఏం మనుషులు" అనుకొంది.

తన యింటో మనిషికి రెండు బాత్రూమ్‌లుంటే ఇక్కడ పదిమంది కొకటే దొడ్డి ఉందని గాని, బంగ ళాలలోని మురికి నర్సింవుల లాంటి వాళ్లయిళ్ల ముందు యధేచ్ఛగా పార్తుం దని కాని, తనకంత పెద్ద పెరడున్నా ఓ మూల ఓ చిన్న గొయ్యి తీసి జేన్‌కి అక్కడ అలవాటు చెయ్యకుండా మంచి అలవాటు పేరుతో ఏదో ఒక వీధి పాడు చెయ్యడానికే ఆ కుక్కని నర్సింవుల్తో బయటకి పంపుతున్నానని గాని, తను కార్లో పోతుంటే లేచిన దుమ్ము నడుస్తున్న వాళ్ల మొహాన పడ్తోందని, కారు వదిలిన పొగ అందరు పీల్చే గాలిని పాడు చేస్తోందని గాని, తన సుఖంలో ఇతర కష్టం ఉందని, ఒకరి చోటు శుభ్రంగా ఉండా లంటే విధిగా మరొకరి చోటు అశుభ్రంగా ఉండి తీరాల్సి వస్తుందని, కొందరు బీదగా ఉంటేనే కొందరు ధన వంతులుగా ఉండ గలరని, మన మంచి బాగే, మరొకరి చెడు నాశనం కాగలదని, అదే ఈనాటి జీవన సూత్రం అని కాని సుజాతకి ఆలోచన రాలేదు.

నర్సింవులకి కూడా అమ్మగారి యింటిని, ఆ పరిసరాల్ని శుభ్రంగా ఉంచేందుకు అమ్మగారి కుక్క చేత తను తన యింటి పరిసరాలు పాడు చేయిస్తున్నానన్న గుర్తింపు లేదు. ఆ కుక్క తనమీద అధికారాన్ని చెలా యిస్తూ అమ్మగారి మీద అభిమానం ఒలక బోయటానికిగల కారణం అతనికి తెలియదు. తెలియదు కనుక బాధ పెట్టదు.

కాని ఇవన్నీ డ్రైవర్ని బాధ పెడ్తున్నాయి. డ్రైవరు కారు నడుపుతూ "ఆలోచిస్తున్నాడు" ఏ మోహిని ఏ పరమార్థం కోసం పక్షపాత బుద్ధితో ఆఫీసర్లకి శుభ్రతని, నౌకర్లకి మురికిని పంచి పెడ్తోంది?" అని.

సారస్వత వివేచన

రచయిత : రాచమల్లు రామచంద్రారెడ్డి, ప్రచురణ కర్తలు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ — 4. వెల : రూ. 6 - 00

ఇందులో 3 'సంవేదన' సంపాదకీయాలు, 13 సమీక్షలు లేక సమాధానాలూ, 2 స్వతంత్ర వ్యాసాలు చేర్చబడినాయి. అయితే విషయసూచికలో 'శ్రీశ్రీ తాత్విక చిత్తవృత్తి' అన్న స్వతంత్ర వ్యాస మొక్కటే చూపబడింది. విషయ సూచికలో లేని స్వతంత్ర వ్యాసం కొడవటిగంటి కుటుంబరావుగారి 'సాహిత్య ప్రయోజనం' కి రాయబడిన 'పరిచయం'. మొత్తం 18 రచనలూ సాహిత్య విమర్శలు. చదవ దగ్గవీ చదవ వలసినవి కూడా.

కారణం? ఈ విమర్శల వస్తువులు అధునాతన, సమకాలీన రచయితలూ వారి రచనలూ కావడం, ఒకటీ. రెండవది రాచమల్లు రామచంద్రారెడ్డి (రారా) గారి విమర్శనాత్మకమైన విశ్లేషణా నైశిత్యం. మూడవది రారాగారి శైలి. ఈ శైలిలో రెండు సుగుణాలున్నాయి. మొదటిది సరళమూ, సహజమూ అయిన నేటి ప్రామాణిక వ్యావహారిక భాష. రెండవది. ఎంత కష్టమయిన విషయాన్నైనా సులభంగా అర్థమయ్యే భాషలో రాయగల రా. రా. గారి రచనాశక్తి.

జి. జె. రామారావు

'లక్ష్య నిర్వచనం' అన్న మొట్టమొదటి రచనలో రా. రా. గారు యిలా చెప్పేరు: ". . సాహిత్యం జీవితంతో పెనవేసుకొని వున్నా, అది ఒక ప్రత్యేక రంగం, దానికొక స్వతంత్ర ప్రతిపత్తి వుంది. దాని హద్దులు నిర్ణయించడం కష్టమే అయినా, హద్దులు ఉన్నమాట నిజం. రాజకీయాలనుండి గానీ, తత్వజ్ఞానంనుండి గానీ, మానవ జీవితంలోని మరే రంగంనుండి గానీ సాహిత్యం ప్రేరణా, ప్రోత్సాహమూ పొందవచ్చు. కానీ, రాజకీయాలే సాహిత్యం కాదు; తాత్విక చింతనే సాహిత్యం కాదు." ఇది అక్షరాలా నిజమే. సరికదా, ఈ నిర్వచనాన్ననుసరించే, రా. రా. గారు తమ విమర్శనా వ్యాసాలన్నీ రాసేరు.

అయితే చిక్కు ఎక్కడ వుందంటే సాహిత్యాన్ని ఏకొలత బద్ధతో కొలవాలి అనే చోట. ఏది మంచి సాహిత్యం? ఏది గొప్ప సాహిత్యం? ఏ ఆధారం మీద ఈ

నిర్ణయాలు చెయ్యాలి, చెయ్యగలము? అనే విషయాల మీద రా. రా. గారు ఏమీ చెప్పలేదు.

క్షమించండి. చెప్పేరు. ఏమి చెప్పేరో చూడండి :

ఈ గ్రంథంలో ఉన్న వ్యాసాలన్నిటికీ, నా దృష్టిలో, తాత్వికమయినదీ, అందువలన ముఖ్యమైనదీ, అయిన రా.రా. గారి ప్రతిపాదన ఒకటి వుంది. ఇదే ఆయన సాహిత్య వైమర్శిక ప్రాతిపదిక. ఈ ప్రాతిపదిక పైనే సాహిత్య ప్రయోజనమూ, ఘనతా అన్నీ నిర్ణయించాలని ఆయన పదే పదే వక్కాణించారు కూడా. ఉదాహరణకు :—

49 వ పేజీలో, "సాహిత్యం మేధా వ్యాపారం కాదు. అది సంపూర్ణంగా హృదయ వ్యాపారం. విమర్శ మేధా వ్యాపారమే కదా అనవచ్చు. కానీ, సాహిత్యాన్ని ముందు హృదయంతో ఆస్వాదించి తరువాత మేధతో పరిశీలించిన వాడే ఉత్తమ విమర్శకుడౌతాడు."— అని అన్నారు రా. రా. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఈ ప్రాతిపదిక రా. రా. గారి వ్యాసాలన్నిటిలోనూ ఉందని చెప్పక తప్పదు. మచ్చుకి మరి కొన్ని ఇదే ప్రాతిపదిక గల (ఇవి కాక ఇంకా ఎన్నో ఉన్నాయి) వాక్యాలు ఉదహరిస్తున్నారు.

"సర్వ సాహిత్యానికి హృదయమే కేంద్రం, హృదయమే యితివృత్తం, హృదయమే హద్దు హృదయాన్ని దాటి. . . సాహిత్యమంటూ వుండజాలదు." (పే. 68)

"హృదయం తక్కువై, మేధ యెక్కువయినప్పుడు Academic విమర్శ బయలుదేరుతుంది. సాహిత్యం హృదయానికి మాత్రమే అర్థమవుతుంది అనేది సాహిత్య జీవులందరికీ తెలిసిన సత్యమే". (పే. 53)

చలంగారి 'పురూరవ' "పాఠకుని మేధకు appeal చేస్తుంది కానీ, పాఠకుని హృదయానికి యెక్కడా చేయదు. హృదయ స్పందన కలిగించే అనుభూతి యెక్కడా లేదు. ఊర్వశీ పురూరవుల్లో యెవరిమీదా జాలిగాని, గౌరవముగాని, సానుభూతిగాని యెప్పుడూ కలదు". (పే. 62)

"కళ అంటే నేరుగా హృదయాన్ని తాకేది. కళ అంటే అనుభూతి." (పే. 129)

కళాత్మకంగా అంటే వ్యక్తుల కష్టసుఖాలకూ, రాగద్వేషాలకూ, హృదయగతమైన అనుభూతులకూ ప్రాముఖ్యం యివ్వడం." (పే. 17)

"మరొక విధంగా చెప్పాలంటే, ఆయనలో (గురజాడలో) కవి అంశ యెంత ఉన్నప్పటికీ, కవి అంశకంటె మేధావి అంశ నూరురెట్లు బలంగా ఉండింది." (పే. 153).

ఈ వాక్యాల వల్ల నిరూపణ అయేది ఏమిటంటే' రా. రా. అభిప్రాయంలో సాహిత్యానికి పరిధి కేవలం "హృదయం" మాత్రమే అనిన్నీ; సాహిత్యం మేధా

ఆత్మాశ్రయమయిన 'హృదయం' ప్రమాణమయితే, ఆ ప్రమాణం తప్పు అనక తప్పదు. అసలది ప్రమాణమే కాదు. ఎంచేతంటే ఒకే రచనపై, యెందరో పఠితలు వాళ్ల వాళ్ల 'హృదయా' లను అనుసరించి తీర్పులుచేస్తే ఆ తీర్పులన్నీ సరియైనవని ఒప్పుకోక తప్పదు. అయితే, అన్ని తీర్పులున్నప్పుడు, ఏ ఒకటీ తీర్పు కాదన్న మాట. పరిపక్వమయిన రా. రా. గారి తీర్పు సరియైనదా, లేక అపరిపక్వమయిన పిల్లవాడి తీర్పు సరియైనదా? ఇలాటి ప్రశ్నలు రావడమే కాకుండా, కొన్ని ప్రమాదాలు కూడా, ఈ 'హృదయ' ప్రమాణంలో ఉన్నాయి. వీటిలో ముఖ్యమయిన ప్రమాదం, 'హృదయం' పేరుతో ఇష్టానిష్టాల బట్టి సాహిత్యాన్నీ, రచయితలనూ పొగడడం, తెగడటం.

ఈ ప్రమాదానికి, సాహిత్య విమర్శలో సిద్ధహస్తులైన రా. రా. గారి వంటి వారు కూడా గురి అయినట్టు తోస్తుంది. ఉదాహరణకి – చలం కథల గురించీ, వాటి సాహిత్య లక్షణం గురించీ రా. రా. గారీ క్రింది అభిప్రాయాన్ని వెలిబుచ్చేరు:

"చలంకు కథకూ, నవలకూ సంబంధించిన కళానియమాల మీద ధ్యాసే లేదు. కథకొక లక్ష్యమూ, ఆ లక్ష్య సాధనకు తగిన పాత్రలూ, ఆ పాత్రలకు అనువయిన సన్నివేశాలూ, ఆ సన్నివేశాలకొక క్రమ పరిణామమూ, ఒక కార్య కారణ సూత్రమూ మొదలయిన శిల్ప నియమాలను చలం యెప్పుడూ పాటించి యెరుగడు." (పే. 55)

అందువల్ల చలం రచనలు సాహిత్యం కాదనుకునేరు. రా. రా. గారు ఇక్కడ తమ 'హృదయాన్ని' ఒక పక్కకు నెట్టి, అంటారు కదా: "చలం గొప్పతనమంతా ఆయన విప్లవాత్మకమైన భావాల్లో వుంది; ఆ భావాల వెంట వున్న అగ్ని పర్వత సదృశమైన ఆవేశంలో ఉంది." (పే 56). ఇక్కడ 'భావాలకు' ప్రాధాన్యత ఇచ్చేరు; 'ఆవేశానికి' రెండో స్థానం ఇచ్చేరు. అయినా, చలం "సాహిత్య గుణం సంపాయించుకున్న రచనలు" చేసేడని తీర్పు చెప్పేరు. సాహిత్యం "సంపూర్ణంగా" హృదయ వ్యాపారం; దానికి "హృదయమే హద్దు. హృదయాన్ని దాటి" సాహిత్యం ఉండ జాలదన్న రా. రా. గారు చలం మీద చెప్పిన చిత్రమయిన తీర్పుకు కారణం ఏమనాలి? ఇష్టం అనాలి.

ఇలాగే, ఒకచోట "వీరేశలింగం రచనలు కళాత్మకంగా చౌకబారువి" అని (పే. 140) నిర్ణయించేరు. "కళా నియమాల ధ్యాసే" లేని చలం రచనలు సాహిత్యం అయితే వీరేశలింగం రచనలు "చౌకబారు" వని తీర్పు చేయడానికి రా. రా. గారి అనిష్టమే కారణమని చెప్పక తప్పదు.

చలం భావాలను "విప్లవాత్మక" భావాలని రా. రా. గారు నిర్ణయం చేసేరు. ఈ నిర్ణయాన్ని కూడా ప్రశ్నించవలసి వుంది. కారణం ఏమిటంటే, ఉత్పత్తి సంబంధాలనూ, వాటి ననుసరించి మొత్తం సాంఘిక సంబంధాలనూ

ఆత్మాశ్రయమయిన 'హృదయం' ప్రమాణమయితే, ఆ ప్రమాణం తప్పు అనక తప్పదు. అసలది ప్రమాణమే కాదు. ఎంచేతంటే ఒకే రచనపై, యెందరో పఠితలు వాళ్ల వాళ్ల 'హృదయా' లను అనుసరించి తీర్పులుచేస్తే ఆ తీర్పులన్నీ సరియైనవని ఒప్పుకోక తప్పదు. అయితే, అన్ని తీర్పులున్నప్పుడు, ఏ ఒకటీ తీర్పు కాదన్న మాట. పరిపక్వమయిన రా. రా. గారి తీర్పు సరియైనదా, లేక అపరిపక్వమయిన పిల్లవాడి తీర్పు సరియైనదా? ఇలాటి ప్రశ్నలు రావడమే కాకుండా, కొన్ని ప్రమాదాలు కూడా, ఈ 'హృదయ' ప్రమాణంలో ఉన్నాయి. వీటిలో ముఖ్యమయిన ప్రమాదం, 'హృదయం' పేరుతో ఇష్టానిష్టాల బట్టి సాహిత్యాన్నీ, రచయితలనూ పొగడడం, తెగడటం.

ఈ ప్రమాదానికి, సాహిత్య విమర్శలో సిద్ధహస్తులైన రా. రా. గారి వంటి వారు కూడా గురి అయినట్టు తోస్తుంది. ఉదాహరణకి – చలం కథల గురించీ, వాటి సాహిత్య లక్షణం గురించీ రా. రా. గారీ క్రింది అభిప్రాయాన్ని వెలిబుచ్చేరు :

"చలంకు కథకూ, నవలకూ సంబంధించిన కళానియమాల మీద ధ్యాసే లేదు. కథకొక లక్ష్యమూ, ఆ లక్ష్య సాధనకు తగిన పాత్రలూ, ఆ పాత్రలకు అనువయిన సన్నివేశాలూ, అ సన్నివేశాలకొక క్రమ పరిణామమూ, ఒక కార్య కారణ సూత్రమూ మొదలయిన శిల్ప నియమాలను చలం యెప్పుడూ పాటించి యెరుగడు." (పే. 55)

అందువల్ల చలం రచనలు సాహిత్యం కాదనుకునేరు. రా. రా. గారు ఇక్కడ తమ 'హృదయాన్ని' ఒక పక్కకు నెట్టి, అంటారు కదా: "చలం గొప్ప తనమంతా ఆయన విప్లవాత్మకమైన భావాల్లో వుంది ; ఆ భావాల వెంట వున్న అగ్ని పర్వత సదృశమైన అవేశంలో ఉంది." (పే 56). ఇక్కడ 'భావాలకు' ప్రాధాన్యత ఇచ్చేరు ; 'ఆవేశానికి' రెండో స్థానం ఇచ్చేరు. అయినా, చలం "సాహిత్య గుణం సంపాయించుకున్న రచనలు" చేసేడని తీర్పు చెప్పేరు. సాహిత్యం "సంపూర్ణంగా" హృదయ వ్యాపారం ; దానికి "హృదయమే హద్దు. హృదయాన్ని దాటి" సాహిత్యం ఉండ జాలదన్న రా. రా. గారు చలం మీద చెప్పిన చిత్రమయిన తీర్పుకు కారణం ఏమనాలి? ఇష్టం అనాలి.

ఇలాగే, ఒక చోట "వీరేశలింగం రచనలు కళాత్మకంగా చౌకబారువి" అని (పే. 140) నిర్ణయించేరు. "కళా నియమాల ధ్యాసే" లేని చలం రచనలు సాహిత్యం అయితే వీరేశలింగం రచనలు "చౌకబారు" వని తీర్పు చేయడానికి రా. రా. గారి అనిష్టమే కారణమని చెప్పక తప్పదు.

చలం భావాలను "విప్లవాత్మక" భావాలని రా. రా. గారు నిర్ణయం చేసేరు. ఈ నిర్ణయాన్ని కూడా ప్రశ్నించవలసి వుంది. కారణం ఏమిటంటే, ఉత్పత్తి సంబంధాలనూ, వాటి ననుసరించి మొత్తం సాంఘిక సంబంధాలనూ

మార్చే లక్ష్యం గల భావాలను మాత్రమే విప్లవాత్మక భావాలని గణించడం సమంజసం. సాంఘిక సంబంధాలలో ఒక అంశ అయిన (అది యెంత ముఖ్యమయిన దయినా) స్త్రీ పురుష సంబంధాలను మార్పు చేసే లక్ష్యంగల చలం భావాల వంటి భావాలను తిరుగుబాటు భావాలనడం సబబు. ఇదే లోక వాడుక కూడా. విప్లవ భావాలకయినా, తిరుగుబాటు భావాలకయినా కారణం వస్తునిష్ఠమయిన వాస్తవికత, సాంఘిక పరిస్థితులు. ఇది నిర్వివాదం. అయినా రా. రా. గారి దృష్టిలో "తిరుగుబాటు తత్వం...మనిషి లోపలి నుండే పుట్టాలి. మనిషిలో అంతరిక అవసరాలూ, ఆకాంక్షలూ తీవ్రమైనప్పుడు తిరుగుబాటుకు పురి కొల్పుతాయి." (పే 82). అనగా ఏ కోశాన్నో రా. రా. గారి సాంఘిక శాస్త్ర దృష్టిలో ఆత్మాశ్రయత (Subjectivism) లోతుగా నాటుకొని వుందన్న మాట. అందు చేతనే, ఈయన సాహిత్య దృష్టిలో "హృదయా"నికీ, ఇష్టానిష్టాలకూ చాలా ప్రాధాన్యత వచ్చింది.

దిగంబర కవుల మీద ఈయన చేసిన తీర్పుకి కారణం కూడా అనిష్టమే అనిపిస్తున్నది. రా. రా. గారి మాటల్లో "వీళ్ల రచనలు చదివితే అసహ్యం వేస్తుంది." కారణం? "ఆ తిట్లూ, ఆ బూతులూ, ఆ ఆటవిక ఆవేశమూ, ఆ ఒళ్లెరగని కుసంస్కారమూ, ఆ నోటి తీటా, ఆ మాటల కంపూ మనకు జుగుప్స కలిగిస్తాయి." (పే. 121). ఈ ధోరణిలో, దిగంబర కవులు "కవిత్వపు వాసన యెక్కడా లేకుండా కవులమని చెప్పుకుంటూ మోసం" చేస్తున్నారని రా. రా.గారు చెప్పేరు. కాని దిగంబరులది ఎలా కవిత్వం కాదో ప్రత్యక్షంగా నిరూపించలేదు. సరికదా, "సమాజం కుళ్లుకు వీళ్లు ఒక చిహ్నం. సమాజం కుళ్లులో వీళ్లు ఒక భాగం. సమాజం కుళ్లిపోయిందనడానికి వీళ్లు ఒక నిదర్శనం. సమాజం కుళ్లిపోవడానికి వీళ్లూ ఒక కారణం" (పే. 122) అని ఒక మహావేశంతో మహా కఠినమయిన తీర్పును రా. రా. గారు చేసి విడిచిపెట్టేరు. ఇలాటి తీర్పును చేసే "హృదయం" కాని, "మేధస్సు" కాని నాకు లేవని ఒప్పుకుంటా. లేకపోయినందుకు నేను సిగ్గుపడడం లేదు కూడా. నా ఉద్దేశంలో దిగంబరుల విప్లవ లక్ష్యాలకు సరియైన బాణాలను సంధించక, తిరుగుబాటు విధానాలను (Rebellious means) ఉపయోగించడం, ఒక పరస్పర వైరుధ్యం. అందువల్ల వీరి కవితలకు పటుత్వం లేకపోయింది. వీరివి కవితలని నా భావం. కేవలం నినాదాలతో కాకుండా, కవితా చిత్రాలతో రచనని జరిపించేరని నా భావం. నా దృష్టిలో యివి చాలా చోట్ల అద్భుతంగా ఉన్నాయి కూడా. అందుచేతనే, నా అభిప్రాయంలో, రా. రా. గారి అనిష్టం, దిగంబరుల మీది తీర్పుతో పరాకాష్ఠ నందుకుంది.

రా. రా. గారు ఇట్టి వైమర్శక "మేధస్సు"తో జయదేవుడు గీతగోవిందం మీదా ఎందరో రచయితలూ, సాహిత్యం మీద చెణుకులు చెణికేరు. అయితే సాహిత్యాన్నీ, రచయితలనూ సరిగా ఎలా విలువ కట్టడమో రా. రా. గారికి

తెలియక కాదు. ఉదాహరణకు రమణారెడ్డి గారి 'మహోదయం' మీది సమీక్షలో (పే. 149) గురజాడ గురించి తీర్పు ఏ మాదిరిగా చెయ్యాలో, రా. రా. గారు వివరించేరు ఈ విధంగా :

గురజాడ "రచనలనన్నిటినీ సమీక్షించి, ఆయన విశ్వాసాలనూ, భావాలనూ, రచనా తత్వాన్ని పరిశీలిస్తే తప్ప ఆయన పూర్ణ వ్యక్తిత్వం బయల్పడదు. వీటికి తోడు గురజాడ కాలం నాడూ, అంతకు ముందూ వుండిన సామాజిక పరిస్థితులూ, సాహిత్య స్థితీ సమగ్రంగా అవగాహన చేసుకుంటే తప్ప మన సాహిత్య చరిత్రలోనూ, మన సాంస్కృతిక చరిత్రలోనూ గురజాడ స్థానమూ, ఆయన కృషి యొక్క విలువా అర్థం కావు. కనుక చారిత్రక పూర్వరంగం, జీవితకథ, సాహిత్య సమీక్ష ఈ మూడూ 'మహోదయంలో' ప్రధాన భాగాలుగా ఉన్నాయి."

ఈ మూడు గీటురాళ్లు గురజాడకే కాక ఏ రచయిత (ల) కయినా వర్తింప చేయడమే సరియైన విమర్శనా పద్ధతి. మహీధర రామమోహన రావు గారి, 'కొల్లాయి గట్టితేనేమి'? 'స్వయంవరణం' అనే రెండు నవలల మీది సమీక్షలలోనూ, రా. రా. గారు ఈ గీటురాళ్లని కొంత వరకు ఉపయోగించేరు. అయినా, ఈ సక్రమమైన పద్ధతి తెలిసి వుండి కూడా, వీరేశలింగం గారి రచనలని నిరసించేరు! "హృదయం", "మేధస్సు" అనే సైద్ధాంతిక విభజనలు రా. రా. గారు అవలంబించడం వల్ల ఆయన విమర్శ, తీర్పులు చాలా దెబ్బతిన్నవి. ఇది ఏ మాదిరిగా జరిగినదీ తెలుసుకోవడానికి కూడా రా. రా. గారి పుస్తకం చదవాలి.

పరిణామం!

పులిచేరి రామమోహన రావు

కలంలో నుండి
ప్రవహించిన సిరా
కాగితానికి
అంటుకు పోతుంది,
పౌంటన్‌లా ఊరిన ఇంకు
తన ద్రవరూపపు ఉస్తిత్వాన్ని
కోల్పోయి
కాగితంలోనికి ఇంకిపోతుంది.
అయినా కనిపిస్తూనే వుంటుంది;
నీవూ అంతే
కాలేజీ గేటు దాటి
డిగ్రీ పాళీ గుండా
జీవితంలోనికి
కలలా ప్రవహించిన నీవు
జమాఖర్చు దస్త్రాలకు
సిరాలా అంటుకపోయావు
నీ ఆశలూ, ఆశయాలూ
ఆత్మస్థైర్యం
సమస్తం ఇంకిపోగా
మండే సూర్యుని కడ్డుగా
చింకి గొడుగేసుకుని
నీవు మాత్రం మిగిలావు
గుమస్తాగా;
ఏటా పుడుతున్న ఆడపిల్ల
జీవితంలో నీకు లభ్యమవుతున్న
ఏన్యువల్ ఇంక్రిమెంట్.

ది గ్రేట్ హీరో

కథానిక

డాక్టర్ ఎ. విజయలక్ష్మి

అర్ధరాత్రి దాటాక ఫోన్ మ్రోగింది. అంతకు ముందే కేస్ డెలివర్ అయ్యాక లోపలికి వచ్చి పడుకున్నాను. బద్ధకంగా కళ్ళుమూసుకునే చెయ్యిచాచి ఫోన్ అందుకున్నాను.

"డాక్టర్ గారా?" ఎవరో అడుగుతున్నారు.

"అవును" కొంచెం మెలకువ తెచ్చుకుని జవాబిచ్చాను.

"మా పిన్ని స్పృహతప్పి పడిపోయింది. మీరు వెంటనే వచ్చి చూడాలి. గాంధీనగరంలో ఒంటి మామిడి జంక్షన్ దగ్గర." అతను యింటి గుర్తులు చెప్తున్నాడు.

"నేను బయటికి విజిట్స్‌కి రాను. సారీ!" విచారం ధ్వనిస్తున్న స్వరంతో చెప్పి ఫోన్ పెట్టేసాను. పేషెంట్ పరిస్థితి బాగులేనప్పుడు, నేను బయటికి విజిట్స్‌కి రానని చెప్పి తప్పించుకోవడం బాధ్యతారహితమే. కాని అర్ధరాత్రి పేషెంట్‌ని వెదుక్కుని వెళ్ళి వైద్యం చేసేంత ఆదర్శమూర్తిని కాను.

రాత్రిళ్ళు పదిసార్లు లేవడం, పడుకోవడం అలవాటయిపోయినందువల్ల ఫోన్ పెట్టేసిన మరు నిమిషంలో నిద్రలోకి జారాను. మళ్ళీ కొద్ది నిమిషాల్లోనే ఫోన్ రింగయింది. విసుగ్గా చెయ్యి చాచాను.

"డాక్టర్ గారేనా?" ఇందాకటి గొంతే.

"ఎస్"

"మేడమ్! కారు పంపిస్తాం. మీరో సారి రావాలి". గొంతులో అదుర్దా లేదు. రవ్వంత అర్థింపు మాత్రం వుంది. అప్పటికే పేషెంట్‌ని చూడడానికి రానన్నందుకు న్యూనతగా వుందేమో, అతనలా అనేసరికి వెనుక ముందాడుతున్న మనిషిని వెనక్కు నెట్టేసి, నాలోని డాక్టరు ముందు కొచ్చింది.

"అలాగే, రండి" ఎన్నడూ పగలు కూడ బయటికి విజిట్స్‌కి వెళ్ళని నేను అర్ధరాత్రి బయటికి వెళ్ళడానికి అంగీకారం తెలిపాను. నా రూల్సు, యిష్టాయిష్టాల కంటే పేషెంట్ ముఖ్యమని పించిదా క్షణంలో. క్షణంలో, సగం సేపు కూడ గడవలేదు. యింకా ఫోన్ నా చెవి దగ్గరే వుంది.

"యిందాక ఫోన్ చేస్తే బయటికి రానన్నారు. డాక్టరయ్యుండి మీరలాగేనా జవాబు చెప్పేది? మీరు తప్పితే యింకెవరూ డాక్టర్లు లేరనుకుంటున్నారా యిక్కడ?" ఒక్క సారిగా నిద్ర మత్తు వదలి పోయింది. కాని అతని దులుపుడుకి నా నోటంట మాట రాలేదు. అతని ధూర్తత్వం చూస్తూంటే నిజంగా పేషెంట్ కోసం ఫోన్ చెయ్యలేదని అర్థమయింది.

"ఒక్క అరనిమిషంలో డాక్టర్ని తెచ్చుకోగలం. యింకెవరూ డాక్టర్లు లేరనుకోకు". అతని అసందర్భ

ప్రలాపం వింటున్నాను కాని ఏంమాట్లాడాలో తోచలేదు. "అరనిమిషంలో డాక్టర్ని తెచ్చుకోగలవాడివి, అర్ధరాత్రి నిద్రలేపి మరీ అంకమ్మ శివాలెందుకు పెడుతున్నావయ్యా మహానుభావా !" అనుకున్నాను.

"డాక్టరయుండి పేషెంట్‌కి బాగా లేనప్పుడు బయటికి రానంటావా;" అతని జబర్దస్తీచూచి కోపమొచ్చింది.

"నా యిష్ట మయితే వస్తాను లేకపోతే లేదు". నేనింక చెప్తూనేవున్నాను.

"యూ షటప్" అని ఫోన్ పెట్టాసాడతను. బిందెడు పేడ నీళ్ళు నా ముఖాన గుమ్మరించినట్లయింది. పని గట్టుకుని నన్నింతగా అవమానించిన వాడెవరో తెలియటం లేదు. అస్థిమితంగా లేచి లైట్‌వేసి టైమ్ చూచాను. మూడయింది.

"ఏమిటి? ఎవర్ని తెల్లా వారకుండానే తిడతున్నావు?" అతను 'షటప్' అనగానే అసంకల్పిత ప్రతీకార చర్యలా నా నోటి నుండి కూడ 'షటప్' అని వచ్చింది. అది విని శ్రీవారు కళ్ళు సగం తెరచి అడిగారు.

"ఏం లేదు మీరు పడుకోండి." పడుకోండని చెప్పాను గాని అస్థిమితంగా వున్న నా మనసు ఊరుకోలేదు. ఒక నిమిషం కూడ పూర్తిగా గడవకుండానే

మహాగాయకుని అంతర్ధానం

శశికాంత్ శాతకర్ణి

బాల్కని పిట్ట గోడ మీద
రాత్రి వెన్నెలకు విశాలంగా విరిసిన
పెర్రేన్ మీద
నీళ్ళ పంపు వంపు మీద
ఆదివారం బద్ధకంగా
ఒళ్ళు విరుచుకుంటుంది
పక్కమీద అటుఇటు కదులుతూ
నేను మూడోఝాము నిద్రతీసేసరికి
ఆలస్యంగా వచ్చిన ఉదయం
మధ్యాహ్నంలోకి పాకింది
నిశ్శబ్దంగా గర్జించే ఒంటరితనం
నా మీద చేసే దురంతాలను
తిట్టుకొంటూ కాలకృత్యాలు
తీర్చుకొన్నాను

మధ్యాహ్నం భోజనం ముగించుకొని
భుక్తాయాసం తీర్చుకొంటూండగానే
నా గది కిటికీ ఊచల మీద
సాయంసంధ్య వ్రేలాడింది
చెవులు చిల్లులు పొడిచే
లౌడ్‌స్పీకర్‌లాంటి గొంతుకతో
పగలంతా కాంతికృతుల కచేరి చేసిన
మహాగాయకుని పాట విందామని
తలుపు తెరచిన నాకు
చీకటి నిండిన ఆకాశం ఎదురైంది
ఆ గాయకుడూ లేడు
అతని జాడలూ లేవు
తూరుపు మందిరంలో నిరీక్షిస్తున్న
శ్రోతృ మహాసాగరం మాత్రం
ఊరికే కళవళ పడుతోంది !!

తనని లేపి జరిగింది చెప్పాను. అంతా విని కులాసాగా నవ్వి "ఎవరో పనిలేని పిచ్చి రాస్కెల్. ఆలోచనల్తో బుఱ్ఱ బద్దలు గోట్టుకోక హాయిగా పడుకో" అని ముసుగు బిగించారు. నేనింత అవమానాగ్నిలో కాలిపోతూవుంటే ఏం పట్టనట్లు. అదేదో చాల చిన్న విషయంలా తీసేసి పడుకోమంటే నమిలిమింగేద్దామన్నంత కోపమొచ్చింది.

ఆలోచనల్తో మరి నిద్ర పట్టలేదు. 'యూ షటప్', 'యూ షటప్'. అతని స్వరం నా చెవుల్లో గింగురు మంటూనే వుంది. కాసేపు అయాక చటుక్కున ఆ స్వరాన్ని ముందెప్పుడో విన్నట్లనిపించింది. ఎక్కడ విన్నాను? ఎప్పుడు విన్నాను? ... ఎంత ఆలోచించినా గుర్తుకు రావడం లేదు.

నేను ఆలోచనల్లో వుండగానే భళ్ళున తెల్లారింది. కళ్ళు, మనసు మండిపోతున్నా లేచి రొటీన్‌లో పడ్డాను. జడేసుకుని, బొట్టు సరిచేసుకుంటూ వుండగా జటనెవరో గుంజినట్లయి కోపంగా వెనక్కు తిరిగాను.

"హాయ్ శశీ! ఏమిటే యింత ప్రొద్దున్నే ఊడిపడ్డావు?" అన్నాను నా ఫ్రెండ్ శశిరేఖను చూచి.

"మీ వెనక వీధిలో డి. ఎస్. పి. వుంటున్నాడులే, ఆయనతో పనుండి వచ్చాను" అంది శశి.

"ఏమిటే డి. ఎస్. పి. తో పని? కొంపదీసి మా అన్నయ్య మీదేమైనా కంప్లైంట్ యివ్వడానికొచ్చావా?"

"మీ అన్నయ్యలాంటి వాళ్ళమీద డి. ఎస్. పి. కి కాదు గదా డి. ఐ. జి. కి కంప్లైంట్ యిచ్చినా లాభం లేదు. ఆయన విషయం ఎప్పుడో వదిలేసానులే". చిలిపిగా చూచింది శశి.

"ఏయేయ్! భోలా శంకరుడిలాంటి మా అన్నయ్య నంత మాటనడానికి నీకు నోరెలా వచ్చిందే? కమాన్ టేక్ బాక్ యువర్ వర్డ్". నా గద్దింపుకు నవ్వింది శశి.

"అది కాదే, యీ కాలేజీ కుర్రాళ్ళ బాధ భరించ శక్యం కాకుండా వుందనుకో". అంతలోనే విచారంలో మునిగిపోయింది శశి. దాని విచారం చూచి నవ్వొచ్చింది నాకు.

"ఏయ్! నీకేమైనా మతిపోయిందా? వచ్చే సంవత్సరం నీ కూతురు కాలేజీలో చేరుతుంది. యిప్పుడు నీకు కాలేజీ కుర్రాళ్ళ బెడదేమిటే"?.

"అదేగదే నా బాధ! చదువుకునేప్పుడు ఎవరితోనూ పల్లెత్తు మాటనిపించుకోకుండా గౌరవంగా యూనివర్సిటీ నుంచి బయటపడ్డాను. యిప్పుడీ చెత్తాకారి వెధవల్తో ఫోనులో తిట్లు తింటూంటే సిగ్గుతో నా ప్రాణం పోతూందనుకో". 'ఫోన్‌లో తిట్లు' అనగానే గతుక్కుమన్నాను. ఆత్రుత ఆగింది కాదు.

"ఏమిటే? ఏమయింది? అసలు విషయం చెప్పు". శశి జరిగిన విషయమంతా చెప్పుకొచ్చింది. శశి అక్క కూతురు ఇందిర, శశిదగ్గరే వుండి ఇంటర్ చదువుతూంది. ఆ అమ్మాయి క్లాసమేట్స్ అబ్బాయిలు ఇందిరకోసం ఇంటికి వస్తూంటేనూ, రోజుకి పదిసార్లు ఫోన్ చేస్తూంటేనూ కాస్త చెక్ చేసింది! అక్కడికీ ముందు చాల మృదువుగానే

చెప్పినా ఫోన్‌లో వాళ్ళు రాష్‌గా మాట్లాడడంతో తనూ కొంచెం కటువుగా జవాబిచ్చి కాస్త ఒళ్ళు దగ్గర బెట్టుకుని ప్రవర్తించ మందట. దాంతో రెండు రోజుల్నుంచి ఒకటే ఫోనులు. ఫోన్‌లో శశి కంఠం వినగానే తిట్లు మొదలు పెట్టడం. విశ్వప్రయత్నం మీద నాల్గైవరో ఆరా తీసి డి. ఎసి. పి. కి రిపోర్టిచ్చి వచ్చింది శశి. శశి చెప్పింది విన్నాక, శశితో పోల్చిచూస్తే నాకు జరిగిన పరాభవం చాల తక్కువే.

"దాదాపు తమ తల్లి పయసు స్త్రీతో వాళ్ళంత దరిద్రంగా మాట్లాడ గలుగుతున్నారంటే నాకాశ్చర్యంగా వుంది. ఇంత చిన్నపిల్లలు, ముక్కుపచ్చలారని కుర్రాళ్ళు తమతోటి ఆడపిల్లల్ని ఏడిపించడానికో, లేక వాళ్ళ స్నేహాన్ని పొందాలనే పట్టుదలతోనో, వాళ్ళ తల్లుల్నీ కూడ తిట్టేంత ధైర్యం చేస్తున్నారంటే చాలా బాధగా వుంది. నా కొడుకులే పెడదారిన పోతున్నట్లని పించి ఆందోళనగా వుంది". శశి చెప్తూనే వుంది. నేను తెల్లవారు జామున ఫోనులో విన్న కంఠాన్ని గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. అంతలో ఫోన్ మ్రోగింది.

"ప్రియవుందా?" దురుసుగా అడిగిందో మగ కంఠం. ఆ స్వరాన్ని విన్న వెంటనే గుర్తొచ్చింది నేను తెల్లవారు ఝామున విన్నది. అప్పుడప్పుడూ నా మేనగోడలు ప్రియకోసం అడుగుతున్న కంఠం అదేనని ప్రపంచమంటే ఏమిటో తెలిసీ తెలియని వయసులోని ప్రియ స్నేహాలకు హద్దులుగీసే ప్రయత్నంలో అబ్బాయి లెవరైనా ఫోన్ చేస్తే కొన్నిసార్లు హాస్పిటల్లోనించి ఫోన్ ఇంట్లోకి పంపకుండా మృదువుగా ప్రియలేదని చెప్పి ఫోన్ పెట్టేసేదాన్ని, క్షణంలో సగం సేపట్లో అదంతా గుర్తొచ్చింది.

"ప్రియలేదు బాబూ!" సాధ్యమైనంత సౌమ్యంగా చెప్పాను. దానికి బదులుగా వచ్చిన బెదిరింపు విని నా మెదడు మొద్దుబారి పోయింది. అతను అన్నది మిగతాదేమీ వినపడలేదు. "మేం ఎవరమో తెలుసా? స్టూడెంట్స్మి" - అదే చెవుల్లో గింగురుమంటూంది.

"ఎవరే?" శశి అడుగుతూంది.

"ది మోస్ట్ ఆనరబుల్ అండ్ ద హైయస్ట్ డిగ్నిటరీ ఇన్ ద వరల్డ్".

"ఎవడే వాడు?" శశి అద్భుతగా అడిగింది.

"ది గ్రేట్ హీరో"

"ఎవరే?" శశి విసుగ్గా చూచింది.

"స్టూడెంట్".

ఒక మెరుపు

మెందడుకు పెట్టిన
పదును
ఏ సందేహాన్నైనా
కోస్తుంది!
ఎడదకు చుట్టిన
జాలి
ఏ కష్టాలనైనా
మోస్తుంది.

మిరియాల రామకృష్ణ

తెలుగు అకాడమీ: భాషా పరిశోధన

పులిగడ్డ శివానందశర్మ

1966లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగును అధికార భాషగా నిర్ణయించి 1968లో తెలుగు అకాడమిని స్థాపించింది. అకాడమిలో 'పరిశోధన', 'బోధన', 'ప్రచురణ' శాఖలు మూడున్నాయ్.

వీటిలో పరిశోధన శాఖ చేపట్టిన కార్యక్రమాల్లో అతిముఖ్యమైనదీ, మొట్ట మొదటిదీ 'సామాజికా భాషా పరిశీలన'. ఈ భాషా పరిశీలన కార్యక్రమం మూడు దశల్లో జరుగుతూంది: (1) పర్యటన పరిశోధన ద్వారా భాషా సామగ్రిని సేకరించటం, (2) పరిశోధన ఫలితాలను ప్రాథమిక దశలో తెలుగులోనూ, సాంకేతికంగా ఇంగ్లీషులోనూ ప్రచురించడం, (3) ఆధునిక తెలుగు వ్యవహార భాషకు సమగ్రమైన వ్యాకరణం రచించటం.

పర్యటన పరిశోధన మూడు పద్ధతుల్లో జరుగుతుంది: (1) విషయసేకరణ ప్రణాళిక ద్వారా వ్యవహర్తల నుండి భాషా రూపాలను రాబట్టడం, (2) ఉచ్చారణా, నిర్మితులను తెలుసుకునే నిమిత్తం వారిని పలికించి టేపు రికార్డు చేయటం, (3) విషయాన్ని గుర్తించో, వారి అనుభవాలకు సంబంధించో, కథగా గాని కథనాత్మకంగా గాని వారిచేత చెప్పిస్తూ టేపు రికార్డు చేయటం.

ఇలా భాషా సామగ్రిని సేకరించటానికి ముందుగా రాష్ట్ర సరిహద్దుల్లో లేని (ఇతర భాషా ప్రభావం పడని) జిల్లాలను ఎన్నుకోవటం జరిగింది. ఇప్పటికి అయిదు "బులెటిన్లు" (తెలుగులో)-కరీంనగర్ (1971) విశాఖ (1972), గుంటూరు (1972), కడప (1972), వరంగల్ (1977) జిల్లాలకు సంబంధించినవి-వెలువడ్డయ్. కరీంనగర్ జిల్లా భాషపై 'మోనోగ్రాఫ్' కూడా (ఇంగ్లీషులో) ప్రచురితమైంది (1974). కడప, విశాఖ, వరంగల్, గుంటూరు జిల్లాల భాషలకు సంబంధించిన మోనోగ్రాఫులు ఈ ఏప్రిల్ ముద్రణకు పంపబడుతున్నయ్.

తెలుగులో ప్రచురిస్తున్న పరిశోధన పత్రికలో ఉచ్చారణానుగుణంగా వ్యవహార ఖండికలనూ, వాటిలోని భాషావిశేషాలపై చర్చలనూ, సంక్షిప్తంగా వ్యాకరణాంశాలనూ పొందుపరచటం జరుగుతున్నది. ఇంగ్లీషులో ప్రచురిస్తున్న గ్రంథాల్లో వ్యవహార ఖండికలతోపాటు ఆయా మండలికాలకు వర్ణనాత్మక వ్యాకరణమూ; ప్రాంతీయ సామాజికాది భేదాలు, మాండలిక పటాలు ఉన్నయ్.

ప్రతి జిల్లాలోనూ సుమారు ఒక పది పట్టణాలను కేంద్రాలుగా ఎన్నుకుని, ఒక్కొక్క కేంద్రం నుండి భిన్నకులాలకు, భిన్న విద్యాస్థాయిలకు, భిన్నవృత్తులకు సంబంధించిన భిన్నవయస్కులను ఆడా, మగా నుండి వ్యవహర్తలుగా ఎన్నుకోటం జరుగుతుంది. వీరందరందించిన భాషా సామగ్రి ఆ జిల్లా అంతటా

వాడుకలో ఉన్న భాషను ప్రతిబింబిస్తుంది కాబట్టి, దాన్ని ఆధారంగా తీసుకొని ఈ పరిశోధన అంతా జరుగుతున్నది.

ఈ పరిశోధన వల్ల అనేక ప్రయోజనాలను సాధించటానికి వీలవుతుంది: (1) తెలుగు రాష్ట్రాన్ని ఎన్ని స్పష్టమైన మాండలిక ప్రాంతాలుగా విభజించ వచ్చునో తెలుస్తుంది, (2) పాత్రోచిత భాషను రచనల్లోకి స్వీకరించటానికి ఉపయుక్తమవుతుంది, (3) పాఠ్య గ్రంథాల్లో ఏవి పదాలు, రూపాలు ఏవి ప్రాంతాల్లో వాడుకలో ఉన్నదీ తెలియజేస్తూ అధస్సూచికలను తయారు చేయ టానికి పనికివస్తుంది, (4) ఏవి మాండలికంలో ఏవి భాషలనుండి వచ్చిన ఎరువు మాటలు ఎంతగా మన భాషలోకి చొచ్చుకుపోయాయో తేటతెల్లమవుతుంది, (5) వ్యావహారిక తెలుగు భాషలో వాక్య నిర్మాణాలు ఎన్ని రీతుల జరుగుతున్నవో బోధపడుతుంది, (6) తెలుగు భాషా సంబంధమైన ఇతర పరిశోధనలకు అవ కాశం కల్పిస్తుంది.

ఈ పరిశోధన పైన చెప్పిన జిల్లాలలో గాక కర్నూలు, పశ్చిమ గోదావరి జిల్లాలలో కూడా పాక్షికంగా జరిగింది. రాష్ట్ర మధ్యస్థమైన ఇతర జిల్లాల సర్వే ముగిసిన తర్వాత సరిహద్దు జిల్లాల సర్వే జరుగుతుంది. ఆ తర్వాత ఇతర రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో తెలుగు భాషా వ్యవహార రీతులను అవగాహన చేసు కోటం కూడా జరుగుతుంది. వీటన్నిటికి సంబంధించిన జిల్లా మాండలిక గ్రంథాలు వెలువరించిన తదుపరి ఆధునిక తెలుగు భాషకు సమగ్ర వ్యాకరణాన్ని రచిం చటం తెలుగు అకాడమి ప్రధాన ధ్యేయాల్లో ఒకటి.

ఈ పరిశోధన అంతా ఆధునిక పద్ధతుల ననుసరించి ఆధునిక పరికరాల నుపయోగించి కొనసాగుతుంది.

పై పరిశోధనకు అనుబంధంగా మరొక కార్యక్రమాన్ని తెలుగు అకాడమి చేపట్టింది. అది 'తెలుగు వాక్య నిర్మాణ పరిశీలన' అన్నది. ఇది మాండలికాలలో లభించిన వాక్య నిర్మాణాలతోబాటు వచన సాహిత్యంలో నుంచి మరిన్ని కొత్త నిర్మాణాలను వెలికి తీయడానికి తోడ్పడుతుంది. ఈ కార్యక్రమం 1976 పూర్వార్థంలో మొదలైంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో భిన్న రచయితలు వెలార్చిన వచన రచనలకు సంబంధించిన ఏభై నవలలూ, ఇతర రచనలూ ఎన్ను కొని, వాటిలో ఎన్నుకున్న పేజీలనుండి సుమారు పది వేల వాక్యాలు ప్రాతిపదికగా తీసుకొని ఈ పరిశీలన సాగుతుంది. తెలుగు దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన సుమారు నలభై మంది రచయితలను ఎన్నుకోటం కారణంగా ఈ తెలుగు వాక్య నిర్మితులలో ఉండే భేదాలను సేకరించటానికి వీలుపడుతుంది. ఈ పరిశోధనా ఫలితాలు మరి రెండు మూడు నెలల్లో వెలుగు చూడబోతున్నయ్. ఇది ఆధునిక తెలుగుకు ముందు ముందు వ్రాయబోయే సమగ్ర వర్ణనాత్మక వ్యాకరణ రచనకు కూడా ఎంతో తోడ్పడుతుంది.

బానిస తల నరికి, నిజం చెప్పేసిన ముద్దుబిడ్డ

ఈజిప్టు రాచరిక విలాసాలు

చెస్నట్ అమెరికన్ నీగ్రో రచయిత, హాస్యం, అవహేళన ఆయన ఆయుధాలు. అమెరికన్ సాహిత్య విమర్శకులు గౌరవించిన ప్రథమ నీగ్రో రచయిత ఆయనేనంటారు. విలియం డేన్ హొవెల్స్ ఆయన రచనా శిల్పాన్ని మపాసా, తర్గినేవ్, హెన్రీ జేమ్స్‌లతో పోల్చాడు. అయినా ఆయనను తక్కువగానే అంచనా కట్టారంటుంది, నార్త్ కరోలినా కేంద్ర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ప్రొఫెసరు సిల్వియా లయన్స్ రెండర్.

''గంద్ర గొడ్డలి కథ పుట్టుపూర్వోత్తరా'' అన్న ఆయన కథకిది అనువాదం.

వాషింగ్టన్, ఆయన పోటుకత్తి గురించి మొదట విన్నప్పుడు, నా కది ఎంతో గొప్పఘటన అనిపించింది. దానిని వుదాహరణగా పెట్టుకొని జీవించాలని నిర్ణయించుకున్నాను. ఆ కథనే రెండో మారు విన్నప్పుడు అంత గొప్పగా అనిపించలేదు. కాని బాగానే వుందనిపించిది. తరవాత అదే కథ చెవులు తడకలు కట్టేలాగ వినిపిస్తూండడమూ, చిన్నప్పుడూ, స్వంత వ్యవహారాలు బాధ కలిగిస్తున్న సమయంలో కూడ వాషింగ్టన్‌ను వుదాహరణగా పెట్టుకోమంటూండడంతో ఇంక ఆయన పేరు చెప్తేనే వెగటు కలగసాగింది. పెద్దవాడినై అమెరికన్ చరిత్రను అధ్యయన చేస్తున్న కాలంలో ఆయన

ఖెయాస్

గిడుగు గోపాలరావు

నిస్తబ్దత. నిస్తబ్దత,
నే తిరిగే లోకంలో
చుట్టూ చీకటి
కాలికింద చిత్తడి.
ఎవరికి ఎవరో తెలియని
కాలం
స్వేచ్ఛావాయువులు
చీకటి బజారులో
సమృద్ధిగా దొరుకు
తున్నాయ్,
వ్యక్తిగత విలువలు
కొంతకాలం విశ్రాంతి
కోరాయి
జ్ఞానం తన దారి
తాను చూసుకుంది

అగమ్యాన్వేషణలో
నా నడతకి రూపంలేదు
మసకవెలుగులో
కొన్ని చిత్రాలు కన
పడున్నాయి.
కాలంతీరి రాలిన తారలు
ఇంకా పొగలు క్రక్కు
తున్నాయి
దిగ్గజాలన్నీ చచ్చిన
పీనుగుల మధ్య పడుకొని
ఎండుగడ్డి నెమరేస్తు
న్నాయి

పక్కవాడి ఆర్తనాదం
నా చెవి 'కటంలేదు.
సైనైడు కాలంలో
తీవ్రవాదుల గుప్పిళ్ళ
స్వర్గంలోని కేరింతలు
లీలగా వినపడున్నాయి.
తక్కిన తమ్ముళ్ళందరూ
ఆ లోకం వైపు మోర చాచి
ఆశగా చూస్తున్నారు.
చెడుకాలం నా కాళ్ళల్లో
గుచ్చిన అశక్తత మేకులు
నన్ను సరైన దారిలో
నడవనీయటం లేదు
ముందు దారి లేదు
ఈ ఖెయాస్‌కి అంతులేదు.

వ్యక్తిత్వంలోని గొప్పదనం అర్థమయింది. నా ఆదర్శపురుషుల పట్టికలో ఆయనకు అగ్రస్థానం ఇవ్వడం దేశాభిమానిగా నా కర్తవ్యం అనుకున్నా కాని,ఆ కధా, దాని దుష్ఫలితాలూ మనస్సుకి బాధ కలిగిస్తూనే వున్నాయి.

పెద్దవాడినయ్యాను. విదేశాలు తిరిగిరావాలనీ, పురాతనవస్తు పరిశోధనలు సాగించాలనీ ఆసక్తి పెరిగింది. ఆ వుత్సాహంలో విలియమ్ యి. గ్లాడ్‌స్టన్ నౌక మీద నైల్ నది ఎగువకు దీర్ఘ ప్రయాణం పెట్టుకొని బయలు దేరేను. తిరుగు ప్రయాణంతో ఓడలో బొగ్గు అయిపోయింది. ఎక్కడా క్రొంపా దొరక లేదు. ఓడ కెప్టను బాబ్ - ఎల్ - మెజూక్ వద్ద ఓ వ్యాపారస్థుడి నుంచి మమ్మీల రాసి కొన్నాడు. వాటిని సర్దుతున్నప్పుడు ఒకదానికి చుట్టిన బట్టల మడతలలోంచి ఒక తుట్టలాంటిది కిందపడింది. దానిని ఓ ఇంజనీరు చూసి నాకు తెచ్చి ఇచ్చేడు. దానిని తడిపి మెత్త పరిచి జాగ్రత్తగా విడదీసేను. అది ఈజిప్టు దేశపు 19 వ రాజకుటుంబ కాలంనాటి పాసిరస్ చుట్ట. ధానిలో నాలుగో రమేసెస్ బాల చేష్టితాల గాధలు వ్రాసివున్నాయి. అందులో ఇచ్చిన అతి సామాన్య వుదాహరణలను చూస్తే దేశంలోని బాలుర బోధకే అవి ఉద్దేశించబడ్డాయని తెలుస్తుంది. దానిలో ఒకకథ ఇల్లావుంది.

“లిబియాను జయించి తిరిగి వచ్చేక మూడవ రమేసెస్ ఒక ఏడాది పాటు విశ్రాంతిగా ఇంటివద్దనే వుండిపోయేడు. తన కొడుకు నాలుగవ రమేసెస్‌చదువు సంధ్యల విషయంతో శ్రద్ధచూపిస్తున్నాడు. ఆ కుర్రవాడు చాలమంచివాడు. అయితే పూజారులు ప్రభువును సంతోష పెట్టడానికై యుద్ధాలు, దేశాక్రమణలు గురించే తరిఫీదునిస్తున్నారు. ఆ ప్రభావంతోనే ఆతడు పెరుగుతున్నాడు.

ఒక రోజు మధ్యాహ్న భోజనానంతరం మూడో రమేసెస్, హుషారులో వుండి కొడుక్కి ఎంతో పనివాని తనం వున్న పట్టా కత్తి ఒకటి బహుమానం ఇచ్చాడు. చిన్న రమ్మీ (భావి నాలుగో రమేసెస్ ముద్దు పేరు) తన కత్తి పదును ఎంతుందో పరీక్షకు బయలు దేరాడు. మొదటి పరీక్షలో

కూలీలు

ఉపద్రష్ట సాయి

ఇనపరాళ్ళు
పాల రాళ్ళు
గులక రాళ్ళు
కూలీవాళ్ళు
ఒక జాతికి చెందినవాళ్ళు.

పునాది వెయ్యాలన్నా
సమాధి కట్టాలన్నా
సౌధం పగుల కొట్టాలన్నా
అవసరం వాళ్ళు.

అందానికి నిర్మాతలు వాళ్ళు
సృష్టించిన అందాన్ని
అనుభవించి ఆనందించ లేని
ప్రేతాత్మలు వాళ్ళు.

రాజదర్బారు మందిర ద్వారపాలకుడైన నుబియస్ కొజ్జా వాని చెవి ఎగిరి పోయింది. ఇంక హుషారుతో ఆ అబ్బాయి తల్లి అంతఃపురం లోనికి బయలుదేరేడు. అక్కడ ఒక దాసీది చక్కగా కొప్పు ముడుచుకు కనబడింది. అది తెగుతుందా అని పరీక్షింప దలచేడు. ఆ కొప్పు కాస్తా కింద పడిపోయింది. అక్కడనుంచి వంటశాలకు వెళ్లాడు. కత్తి పదును పరీక్షించేందుకు వీలుగా ఒక వంట వాని చిటికిన వేలు కనిపించింది. వెంటనే అది తెగి కింద పడిపోయింది.

"అక్కడ నుంచి వాకిట్లోకి వచ్చేడు. అక్కడ ఒక బానిసవాడు ఒక బల్లవద్ద వంగొని రాజకిరీటానికి ఇటికదుమ్ముతో మెరుగు పెడుతూ కనిపించేడు చిన్న రమ్మీ చడిచేయకుండా వాని వెనుక నిలుచున్నాడు. బానిసవాడు తల వంచుకు పనిచేస్తున్నాడు. కత్తి పదును చూడడానికి సరయిన భంగిమలోవుంది వాని మెడ. చిన్ని రమీ తమకం ఆపుకోలేక పోయేడు. తన చిన్ని చేయి, అటుగా ఆ కత్తితో ఇట్టే అన్నాడు. ఆ బానిసవాడి తల అట్టే తెగిపడి పోయింది. అంతపదునుగా వుంది ఆ కత్తి. తల తెగి కాళ్లముందుకి దొర్లిపడ్డప్పుడు గాని తాను చేసిన పని అర్థం కాలేదు. తన తండ్రికి ఎంతో ఇష్టుడైన హీబ్రూ బానిస వాడు అబెద్నెగోను తాను చంపేశాడు.

"చాలా చిక్కు వచ్చి పడింది. ఏం చెయ్యడానికీ ఆలోచించు కొనే లోపునే తండ్రిగారి అడుగుల చప్పుడు వినబడింది. చటుక్కున ఆ బాలుడు పక్కనే వున్న నీళ్ల తొట్టిలో దాంకున్నాడు.

"మూడో రమేసెస్ వచ్చి తనకు విశ్వాస పాత్రుడైన బానిస చచ్చి పడివుండటం చూసి మండి పడ్డాడు. "ఎవడ్రా నా హీబ్రూ బానిసను చంపింది?" అని గర్జించేడు.

"ఒక్క క్షణంలో ఇంటిల్లి పాదీ వాకిట్లో పోగుపడ్డారు. ప్రతి ఒక్కరూ ఆ బానిస వాడిని తాము చంపలేదంటే, తాము చంపలేదని చెప్పుకుంటున్నారు. ఆ సమయంలో చిన్ని రమ్మీ నీళ్లతొట్టెలోంచి లేచి వచ్చి తండ్రి దగ్గర నిలబడ్డాడు.

"నాన్న గారూ, నేను అసత్యం చెప్పలేను, నా పట్టాకత్తితోనే ఆ పని చేశా" అనేసేడు, ఆ బాలుడు.

"మూడో రమేసెస్ దిగ్భ్రాంతుడై నోట మాట లేక ఒక్క క్షణం నిలబడి పోయాడు. తరవాత ప్రభువు ముఖాన ఆనంద రేఖలు కనిపించేయి. ఆనందోద్రేకంలో మాటలు తొట్రుపడ్డాయి.

"రా, నాన్నా,రా, నా ముద్దుల తండ్రీ రా; వెయ్యి మంది హీబ్రూ బానిసల్ని చంపేసినా, ఒక్క అబద్ధం చెప్పినప్పుడంత బాధపడను. నీ వంటి కొడుకును ఇచ్చినందుకు ఇసిస్ దేవతకెప్పుడూ నమస్క రిస్తాను."

అప్పుడు అర్థమయింది. తమ తమ కాలం నాటి నాయకుల్ని ఆదర్శ పురుషులుగా చిత్రించడానికై "వాషింగ్టన్ గొడ్డలి" కథ వంటి అసత్యాలు ప్రచారంలో పెట్టడం అనాదిగా వస్తోన్న సంప్రదాయమే కాని వేరుకాదని తెలిసి పోయింది.

నమ్మకానికి నిర్వచనం

(కథ కాదు — అనుభవం)

మహీధర రామశాస్త్రి

"ఏమ్మనగొడుగు కనబడదేమండీ? ఆఫీసు నుంచి తెచ్చారా?"

"అదేవిటి? తేకపోడం ఏవిటి? తెచ్చాగా!"

"మరి కనబడదేం? ఎక్కడో మరచి పోయుంటారు! మొన్న బియ్యం కోసం మార్కెట్‌కి వెళ్లారు. అక్కడ గాని మరచి పోయారేమో?"

"అవునోయ్ అన్నట్టు అక్కడే మర చిపోయా. బియ్యం బస్తాకి తగిలించా! అక్కడే వుంటుంది. రేపు తెస్తా!"

"ఆ! వుంటుంది? ఏవిటి వుండేది? ఓ నీళ్లచుక్క విదలండి! ఎంత మందో వస్తారు. ఎవడు పట్టుకు వెళ్లినా వెడ తాడు. అసలే కొట్టువాడు దొంగ వెధవ. అక్కడికే వెడతారు మీరు; వాడేదో మేనత్త కొడుకయినట్టు! మొన్న ఆ మధ్య నా కళ్లు కప్పేశాడు వాడు. పైని మంచి రకం బియ్యం, అడుగున అడవా రకం. అవన్నీ పారపోయించి, మళ్లీ తూపించా!"

"అబ్బ! దానికి దీనికి సంబంధం ఏవిటి? అది వ్యాపారం. అందరూ చేసేదే అది!"

"వెడుదురూ! వ్యాపారం అంటే మోసవాఁ? మోసగాడు మీ గొడుగు జాగ్రత్త చేసి యిస్తాడు!"

"పోనిలే! దొరకదనుకునే ప్రయ త్నిద్దాం!"

"పోనీయడవేఁ! కొత్త గొడుగు, ఇంకా రంగయినా మాయలేదు!"

"కొత్తదేవిటి? అయిదేళ్లయింది కాని!"

"అయితే పారేయాలని వుందా?"

"మరి, కొత్తదంటావేం?"

"మాటంటే, ముక్కు పట్టుకోవడం చేతనవును!"

"మరేం పట్టుకోవాలి?"

"గొడుగు పట్టుకు రావాలి!"

"అలాగే! అలాగే అన్నానుగా?"

"చూస్తా!"

"వస్తా!"

ఇవి భార్యాభర్తల డైలాగులని చెప్ప నవసరం లేదు.

భర్తగారు బియ్యం కొట్టుకి వెళ్లారు. గొడుగు ఎదురుగ లేదు. నీరసంగ అడిగారు సేట్‌ని.

కారాకిళ్లీ ఊటని బయటికి ఉమ్మి, కుర్రాడికి చెప్పాడు.

"సాహెబ్‌కా ఛతా లాకే దేదో!"

గొడుగుని గర్వంగ అందుకుని యింటికి కదిలాడు భర్త.

భార్య దీనికేవంటుంది?

"కొట్టువాడు నిజాయితీ పరుడు!" అంటుందా? అనదు.

"పక్కా వ్యాపారస్తుడు!" అం టుంది.

నమ్మకానికి నిర్వచనం చెప్పడం కష్టం!

మధ్య తరగతి మనస్తత్వం

ఎం. ఆర్. రావ్

ఈ మధ్యనో పాఠకుడు జాబు వ్రాస్తూ విప్లవోద్యమంలో కనిపించే మితవాద, అతివాద ధోరణులు రెండిటినీ కూడ మధ్య తరగతి మనస్తత్వ ఫలితాలు అంటూంటారు. అదో పూత పదమా, లేక దానికేమన్నా అర్థం వుందా?– అన్నారు. నిజానికి మంచి ప్రశ్నే, సమాధానం చెప్పవలసిందీను.

మధ్య తరగతి అనే పదాన్ని మనం బూర్జువా అనే పదానికి అనువాదంగా వుపయోగిస్తూన్నాము. ఈ తరగతి పెట్టుబడిదారి విధానం సృష్టి. సమాజంలో ఏవిధమైన పునాది లేని తరగతి. అసలు దాని బ్రతుకే అబద్ధం, అవాస్తవం.

నిజానికి సమాజంలో దోపిడీకి గురి అవుతున్న తరగతి అది. కాని ధనిక బూర్జువా వర్గం ఎంగిలి చేత్తో విదిపే కొన్ని మెతుకులు దానికి దొరుకుతాయి. ఆ తరగతి వాడొక బ్యాంకు మేనేజరు అవుతాడు. లెక్చరరు కావచ్చు. ప్రొఫెసరు అవుతాడు. పత్రికా సంపాదకుడు అయ్యే అవకాశం వుంది. చీఫ్ ఇజనీరు, హాస్పటలు అధికారి అవుతాడు. ఈ అవకాశాలు చూసుకొనే ఆ తరగతి తనను బూర్జువా వర్గంలో నిదిగానే కలలు కంటుంది.

అయితే బూర్జువా వర్గానికుండే ఆస్తి భద్రతగాని వాస్తవ పరిజ్ఞానం వలన కలిగిన 'సినిసిజం'గాని వీరికి వుండదు. మతం, దేశభక్తి, పొదుపు, కష్టపడి

* * * * * * * * * * * * * *

గ్రంథ చౌర్యంగురించి చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి

బుద్ధి పూర్వకంగా కాకపోయినా, ఎవరికి ఎవరి కవిత్వమందు విశేషాదరం వుంటుందో వారికి వారి కవిత్వపోలికలు కొంచెం కవిత్వంలో పడక మానవు. కాళిదాసంత వాడికే యీ విషయం అనుల్లంఘనీయంగా కనపడితే, యితరుల మాట చెప్పేదేమిటి? ప్రాచీనంగా వుండే కవుల కవిత్వాలను అనుకరించడం అనాదిగా వున్నట్టే కనపడుతుంది గాని, కొందరు సమకాలీనుల కవిత్వాలను అనుకరించడం మాత్రమే కాదు, తల విఱుపుల్లు పెట్టి, ప్రచురించుకోవడం కూడా కనపడుతుంది. గ్రంథ చౌర్యం కింద అలాంటి దాన్ని చేర్పవలసి వుంటుంది. ఋష్యంశ సంభూతులైన మహా కవులెవ్వరూ యిలాటి అనుచితపని చేయరు........

తనకు నాల్గు నిఘంటు పదములు వచ్చు
ననుచు బదిమందికి దెలియంగ మాఱు
మూల పదములు గుప్పిన ముచ్చటగునె
ప్రతిపదమ్ము రసముట్టి పడిన గాక ?

పని చెయ్యడం, మాటతప్పని రుజుబుద్ధి మొదలైనవి సద్గుణాలనుగా బూర్జువా వర్గం మెచ్చుకుంటుంది. కాని వాని వలన ప్రయోజనం లేదని ఆ వర్గానికి తెలుసు. అందుచేత వానిని తాను అల వరచు కోదు. ఇతరులు ఆచరిస్తే తనకు లాభం. కనక మెచ్చుకుంటుంది. బహు మతులూ ఇస్తుంది.

అయితే పెటీ బూర్జువా తరగతి వానిని జీవిత సత్యాలుగా తీసుకొని భుజాన వేసుకొంటుంది. వాని సాయంతో బూర్జువా వర్గాన్ని మంచి చేసుకొని వారితో వుండగల అర్హత సంపాదించ గలనని దాని ఆశ.

మధ్య తరగతి నుంచి కొందరు పై మెట్టు ఎక్కి బూర్జువా వర్గంలో చేరు తారు. అందరూ చేరలేరు. కొద్దిమందిదే ఆ ప్రివిలేజి. కాని. అది తనకే ఎందుకు రాకూడదనే ఆశ వారిని పట్టి వుంచు తుంది. కాని, అత్యధిక భాగం ఆ జారుడు బల్ల దిగువ దిశనున్న శ్రమ జీవివర్గం వేపే జరుగుతూ, జరుగుతూ పోతుంటారు. వారిని చేరుకో బోతు న్నందుకు వారి మీద ద్వేషాసహ్యాలు పెంచుకొంటారు.

మధ్యతరగతి వారి బాధా, భయమూ అట్టడుగు శ్రమజీవివర్గంలో కలిసి పోతున్నామనే. ఆ శ్రమజీవివర్గంలో వుండే ఏకతాభావం మధ్య తరగతికి వుండదు. బూర్జువా జీవితం, బూర్జువా విలువలతో వారికి ప్రత్యక్షానుభవం వుంది. ఆ అనుభవ ఫలితమైన 'సిని సిజం' వారిలో వుంది. అది ఈ మధ్య తరగతికి లేదు. కాలు జారిపోతున్నా పైకే చూస్తూ, అవేపు నుంచి వచ్చే తన్ను లకి సర్దుకొనే ప్రయత్నమే చేస్తూంటుంది తానున్న స్థితి నుంచి పైకి పోవాలి. ధనం పోగుచెయ్యాలి. ఒడుదుడుకులు లేని జీవితం గడపాలి. యజమాని కావాలి. అధికారం సంపాదించాలి. అదీ దాని లక్ష్యం.

కాని, పెట్టుబడిదారీ నిధానం పెరిగి, బలపడుతున్న కొలదీ ఇవేవీ దానికి అందకుండా పోతున్నాయి అందుకోవడం కష్టమవుతున్నాయి. అందుకున్నవి కూడా నిలుపుకోడం కష్టమైపోతూంది. ఫలితంగా భయం చుట్టుముడుతూంది. గంద్రగోళం, దిగ్భ్రమ కుంగదీస్తున్నాయి. బ్రతుకే దుర్భరమవుతూంది. అయినా ఈ పరి స్థితికి మూలం ఎక్కడుందో అర్థంకాదు. ఈ బ్రతుకింత దుర్భరం ఎందుకవు తూంది? జీవితపు విలువలను పాటిం చనిస్థితికి మనుష్యుడు ఎందుకు వస్తున్నా డని వాపోతారు. కాని ఆ విలువలను పాటించనిది తామేనని వారికి అర్థం కాదు.

ప్రపంచ పరిణామ స్థితిని వారు గుర్తించరు. ఫలితంగా వారి ద్వేషం తమ తరగతి మీదికే ప్రసరిస్తుంది. శ్రమజీవులు తమ దుర్దశకుమూలం తమ వర్గంలో లేదని, పైనుంచి మీద పడే వర్తకమాంద్యాలు, ద్రవ్యోల్బణాలు వంటివనీ, తమ వర్గం వెలుపలి ధని కులూ, యజమానులూననీ వారెరు గుదురు. కనక ఆ బాహ్యశక్తులని ఎదు ర్కొడానికి సమీకృత మవుతారు. ఏక మవుతారు.

కాని, మధ్య తరగతికి కనిపించే శత్రువు తన తరగతికి చెందినవాడే. పక్కన చిల్లరకొట్టు పెట్టుకొన్న వాడు, తన సహోద్యోగి, తన పొరుగు వాడు అతనికి పోటీదారు. ఆ పోటీదారు నెగ్గేస్తే తాను ఆశ పెట్టుకొన్న స్థానం తనకు దొరక్కుండా పోతుందని భయం, దానితో ద్వేషం, ఒంటరి తనం పెంచు కుంటారు.

ఈ పరిణామాల్ని అర్థం చేసుకొనే వారు కొందరుంటారు. శ్రమజీవి ప్రజల వాస్తవికావగాహన వారికి కలుగు తుంది. తమ్మందరినీ పీడిస్తున్న వర్గాన్ని గుర్తిస్తారు. తమ ఏకాకిత్వాన్ని మరిచి సామూహికతత్వాన్ని చేపడతారు.

అవగాహన చేసుకొన్న వారందరూ అసామూహిక ప్రతిఘటనావసరాన్ని గుర్తించలేరు. తమ్ము ఆ ఆస్థికి తెచ్చిన వ్యవస్థ మీదనూ, వర్గం మీదనూ ద్వేషం కలుగుతుంది. కోపం పెరుగు తుంది. కాని, ఆ ద్వేషాన్నీ, కోపాన్నీ తన తరగతికి సహజములైన గుణాల నుంచే వారు పరిష్కరించ బోతారు. ప్రపంచ మంతా తమ శత్రువు. తను ఒక్కడే. తనదే నిజాయతీ. ఆ ద్వేష కారణాలన్ని తనలోనే, తన దృష్టి లోంచే చూస్తాడు. వానిని ఎదుర్కో వడంలో కూడ తాను ఏకాకిగా, తన తోడివారినే ద్వేషిస్తూ వ్యవహరిస్తాడు. వారుకోరేది సామాజిక విప్లవం. కాని, దానికి తీసుకొనే సాధనం వ్యక్తిగతం.

ప్రపంచ పరిణామ పరిస్థితులు తెలిసిన వారందరూ కూడ సామాజిక విప్లవం కోరరు. దానికి ప్రధాన కారణం శ్రమజీవి వర్గం మీది ద్వేషం. మధ్య తరగతిలో అత్యధిక భాగం విధిగా క్రిందికి జరిగిపోయేదే. పెట్టుబడిదారీ విధానం బలపడుతున్నకొద్దీ ఈ జరు గుడు త్వరిత మవుతుంది.

పెట్టుబడి దారీ విధానపు ప్రారంభ దినాల స్వేచ్ఛ, సమానత్వ, సహోద రత్వ ఆశయాలను వారు గుర్తు చేసు కొంటారు. అంత వెనక్కి పోలేక పోయినా, కొద్ది దూరమేనా వెళ్ళా లంటారు. ఈ వ్యవస్థ ఇలా వుండగా కొన్ని సర్దుబాట్లు సూచిస్తారు – అవి జరగవని ఎరిగి వుండి కూడా. కొన్ని ముద్దు పేర్లు పెట్టు కొని ఆత్మవంచన చేసుకొంటారు. ఇంతకు పూర్వపు వారు విప్లవవాదులైతే వీరు సంస్కరణ వాదులు, 'లిబరల్స్' అనవచ్చు.

వీరికి దగ్గరగానే మరో ఆలోచనా ధోరణి వచ్చింది. ఈ వ్యవస్థ చిక్కులు తెచ్చింది. దీనిని పాతమార్చడం కోసం ప్రయత్నంచేస్తే మాత్రం చక్క బడుతుందా? అదో వృథా ప్రయాస. దాని మానాన దాని వదిలేసి మన అస్తిత్వాన్ని మనం కాపాడుకుందాం. ఇక్కడికి వచ్చినా మళ్ళీ ఏకాకిత్వమే.

మధ్య తరగతి మనస్తత్వాలు అన్నవి బహురూపాలు. వానిని అర్థం చేసుకొనే ప్రయత్నం నిజంగా సమా జానికి అవసరం.

ఏప్రిల్ సంచిక 48 వ పుట – రెండో కాలంలో 14వ పంక్తి "విశ్వనాథ అనుయా యులనుకున్నట్టు" అనీ; 25 వ పంక్తిని "అకవిత్వం మాత్ర మే"నని వుండాలి.

కథానిక 'శ్రీ విరించి'

తిరిగిరాని కథ

శేఖరం యిదివరకు కథలు వ్రాసేవాడు. ఇదివరకు అంటే ఒకటి రెండు సంవత్సరాల క్రితం కాదు. దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం మాట. అప్పుడు కాలేజిలో చదువుకునే రోజులు. చీకూ చింతా లేకుండా వుండేది. ఊరికే ఉత్సాహంతో ఉరుకులు పరుగులు ఆయన జీవితంలో భాగంగా, మంచి కాలక్షేపంగా కథలు గట్రా వ్రాస్తూ వుండేవాడు. చదవటానికి బాగా వుండడం వల్లనో యేమో పత్రికల వాళ్లు కూడా యీ కథలను ఆదరించి అచ్చు వేసుకునే వాళ్లు. ఆ రూపంగా అతడికి కథకుడుగా కాస్తో కూస్తో పేరు వచ్చింది. అటు స్నేహ బృందంలోనూ, బంధుజాలంలోను ప్రతిష్ట పెరిగింది. నలుగురిలోను తలెత్తుకు తిరగడానికి అలవాటు పడ్డాడు.

ఇదంతా గతకాలపు వైభవం అనుకున్నాం గదూ! ఇప్పుడతను కథలు వ్రాసినాడన్న సంగతి అతనికే గుర్తు లేదేమో. ఈ మధ్య కాలంలో అతనికి కథలు వ్రాయడం కాదు గదా పత్రికలు చదవడానికయినా కుదరకుండా పోయింది. వాటి మీద యేవగింపు కలిగిందని కాదు. క్షణం తీరికలేని ఉద్యోగాలలో చిక్కుకు పోయినాడు. వీటి ధోరణి చూస్తూ వుంటే ఒక్కొక్కమారు ఊపిరి పీల్చుకుందుకయినా సమయం లేదా అనిపిస్తుంది. ఇక కథలకు కాకరకాయలకు చోటు యెక్కడ? ఇవాళ ఒక ఊళ్లో, రేపు మరింకో వూళ్లో. ఉద్యోగం ఒక్కటే కాకుండా అతని సంసార పరిస్థితులు కూడా అలాగే తయారయినాయి. ఏదేనా విషయాన్ని గురించి సీరియస్‌గా ఆలోచించేందుకు గాని, నిలదొక్కుకుని సమాలోచించేదుకు గాని అతని వల్ల కావడమే లేదు. ఇంటి దగ్గర పరిస్థితులు సరిగా లేక వాటి నుంచి తప్పించుకుందుకే అతను యిలాంటి ఉద్యోగాలను ఎంచుకున్నాడేమో అనిపిస్తుంది చూచేవాళ్లకు. అయితే ఈ పుణ్యభూమిలో కావాలనుకున్న కోరుకున్న ఉద్యోగం లభించే అదృష్టవంతులు యెంత మంది? అనుకున్నదీ అయినదీ రెండు మార్గాలలో బోయి అతడి మనస్సును జరాసంధుడి శరీరం లాగ రెండుగా చీల్చి వేసినాయి. అటువంటి గుంజాటనలో పడిపోయినాడు అతను.

ఇంతకూ రైలు ప్రయాణంలో అతనికి రాజారాం అనే పాత స్నేహితుడు కనిపించి అడగక పోయినట్లయితే కథలు వ్రాయడం విషయం తిరిగి గుర్తుకు వచ్చేది కాదు, శేఖరానికి. ఈ కందిరీగల తుట్టె కదిలేది కాదు. కథల ప్రసక్తి తెచ్చి రాజారాం 'రచన అనేది గజ్జిలాంటిది అంటారే. అంత తొందరగా నీకు ఎలా వదిలిందబ్బా?' అన్నాడు.

శేఖరం జవాబేమి చెప్పలేదు. నవ్వేసి ఊరుకున్నాడు.

కాస్సేపు అయినాక 'నాకు ఏమంత పెద్ద పేరు లేదు. ఏదో కొన్నాళ్లపాటు

అదే పనిగా కథలు వ్రాశాను' అని అంతర్ముఖుడు అయిపోయినాడు. పెద్ద పేరు రాలేదని కొంత నిరాశ పడిన మాట కూడ నిజమే. అదే గుర్తు వచ్చింది యిప్పుడు. అయినా తనకు కథలు రాయడంలో చేయి తిరిగిన మాట మాత్రం యదార్థం. కథలు రాసే వాళ్లలో చాల మందిలాగ తను 'చక్ చక్' రాసి పడేసి నెలతిరిగే సరికి పది పదిహేను కథల చొప్పన 'ప్రొడ్యూస్' చేయలేదు. ఏపత్రిక పుటలు తిరుగవేసినా తనపేరు కనిపించేలాగు చూచుకోవడం తనకు చేత కాలేదు. కథ రాయడం కోసరం మెటీరియల్ వెదకడంలో తను యెక్కువ సమయం గడిపేవాడు. ఆ వస్తువును గురించి చాలసేపు – చాల రోజులు – ఆలోచించుకుంటూ వుండే వాడు. ఎన్నోపాత్రలు అతని మనసును కన్వాస్‌గ ఉపయోగించి దానిమీద తమ చరిత్ర వ్రాసుకుంటూ పోయేవి. వానిలో నికార్సు అయినవి, తనకు బాగా నచ్చినవి, యితరులకూ నచ్చుతాయని నమ్మకం వున్నవాటిని వెలికితీసి కాగితం మీద పెట్టేవాడు. అతని పాత్రలు, అదేం కర్మమోగాని, కాగితం మీదికి రావడానికంటే మనసులో వుండి పోయేందుకు ఎక్కువ యిష్టపడేవి. తనూ వాటిని అంతగా బలవంతంచేసే వాడు కాదు. పోనీలే – వాటికి యిష్టం వచ్చినప్పుడే వస్తాయిలే యేం తొందర– అన్నట్లుగా ఊరుకునే వాడు.

'ఏమిటి ఆలోచనలో పడిపోయినావు? ఏమయినా చెబుతానని చూస్తూవుంటే, అన్నాడు రాజారాం బుజం కుదుపుతూ.

'నువ్వు కథల ప్రసక్తి తెస్తే మనస్సు వెనకటి రోజుల వయిపు పోయింది; 'అసలు నువ్వు కథలు వ్రాయడం ఎందుకు మానేశావు? నేనేం నీ కథలు చదివిన వాడిని కాదనుకో. అయినా ఎకడమిక్ యింటెరెస్ట్ కొద్దీ అడుగుతున్నా'!

'ప్రత్యేకించి కారణం యేమిలేదు. రాయడం చేతకాక మానేశానను కుంటాను.'

'అది సాధ్యమా? ఒక పని కొన్నాళ్లు చేసిన తరువాత – చేతకాకుండా పోతుందా?'

'నువ్వు చెప్పేది మామూలు పనుల విషయంలో నిజం కావచ్చును. కాని రచన సృజనాత్మకమయిన పని. పిండి రుబ్బడం, గానుగెద్దులా గిరగిర తిరగడం అలవాటు అయిన కొద్దీ చేతనవుతాయి: రచనను వాటితో పోల్చటానికి వీలులేదు. వ్రాయలంటే లోపల నుండి అర్జ్ వుండాలి. తప్పని సరిగా యీసంగతి యితరులకు చెప్పాలి ఇతరులతో యిది పంచుకోవాలి-అనుకోకుండా నేనెప్పుడూ యే కథ వ్రాయలేదు, యిదివరకు.''

''అయితే అటువంటి అర్జ్ యిప్పుడు లోపించిదన్న మాట. బాగా సంపాదనలో పడిపోయి వుంటావు' అన్నాడు రాజారాం. తరవాత ఆ ప్రసక్తి మానేసి యేవో మామూలు మాటలలోనికి జరిగి పోయినాడు.

ఆ రోజు ప్రయాణం పూర్తిచేసిన తర్వాత – యింటికి చేరుకున్న దగ్గర్నుంచీ శేఖరానికి మనసులో పురుగు తొలుస్తున్నట్లు అయింది. మంచి

సంఘటన ఒకటి తీసుకుని కథ వ్రాసి పడేశాడు. వ్రాసేసిన తర్వాత 'రిలీఫ్' చిక్కినట్లయింది. పదిహేనేళ్ల తర్వాత మళ్లీ పుత్రకామేష్టి యజ్ఞంచేసినట్లు అనిపించింది.

మరునాడు బజారుకు వెళ్లినప్పుడు పత్రికల స్టాండ్ దగ్గర నిలుచుని 'విశ్వామిత్ర పత్రిక ఒక కాపీ యివ్వండి' అన్నాడు.

స్టాండ్ అసామీ అతన్ని ఎగాదిగా చూచి 'లేదు' అన్నాడు.

'పోనీ -అరుణ రేఖ.' అదే జవాబు.

ఇంకో రెండు పేర్లు కూడ అడిగి – లేదని పిలచుకుని శేఖరం యివతల పడ్డాడు. అతను సొంతం స్టాండ్ నుంచి దాటి వెళ్లకుండనే పత్రికలషాపు అతను అడ్డం తగిలి 'యేమండీ – మీరు యేమి అనుకోనంటే ఒక మాట' అన్నాడు.

ఏమిటిని? అన్నట్లు చూచాడు శేఖరం.

'నేను పది పన్నెండేళ్లుగా పత్రికల ఫీల్డ్‌లో వున్నాను. మీరు అడిగిన నాలుగు పత్రికలు నేను చూడనే లేదు. మీరుగానీ ఆ పేర్లతో కొత్త ప్రతికలు ప్రారంభించ దలుచుకుని వాటికి 'ప్రి పబ్లిసిటీ' యివ్వడం కోసం యిలా అడుగుతున్నారా అని అనుమానం వచ్చింది. నిజంచెప్పరూ' అన్నాడు.

శేఖరం అతనికి సంజాయిషి యిస్తూ 'లేదండీ నేను అడిగిన పత్రికలు పది హేనుయేళ్ల క్రిందట బాగా ప్రచారంలో వుండేవి. నేను యీ మధ్య వాటిని చూడడం లేదు. పోనీ పాత పత్రికలు యెలా వున్నాయో చూద్దామనిపించి అడిగాను అంతే. బహుశ ఆ పత్రికలు ఆగిపోయి వుంటాయి. పోనీ–ఒక పని చేయండి. ఇప్పుడు బాగా అమ్ముడు అవుతున్న కథల పత్రిక ఒకటి యివ్వండి. కాలక్షేపానికి తీసుకుపోతాను' అన్నాడు.

షాపతను యివ్వడం – శేఖరం దాన్ని ప్రాణప్రదంగా తీసుకు వెళ్ళడం జరిగింది. కాని ఆ పత్రిక చదివే తీరుబడి మాత్రం దొరకలేదు. శేఖరం యిది పని కాదని తను రాసిన కథను ఆ పత్రిక చిరునామకు పోస్ట్‌చేసి వూరుకున్నాడు. ఆ పత్రిక తన స్వగ్రామం నుంచి వస్తూ వుండడం అతనికి మరింత సంతుష్టి కలిగించినట్లు అయింది.

అయిదారు నెలల వరకూ అ పత్రిక కోసం ఆతురతగా చూడసాగాడు; తన కథ వచ్చిందేమోనని. అతని ఆశ నిరాశ అయింది ఆ తరువాత అతను దాని సంగతే మరచి పోయినాడు.

ఓ సంవత్సరం గడిచింది.

శేఖరం స్వగ్రామానికి వెళ్ల వలసి వచ్చింది. అనుకున్న పనులన్నీ పూర్తి చేసుకుని నిశ్చింతగా వెళ్లి పోవాలను కున్నాడు గనుక వారం రోజులపాటు అక్కడ వుండిపోయాడు.

అతను ఊరికి వచ్చిన రెండో నాడు 'అన్నట్లు అన్నయ్యా! చెప్పడం మరచాను, నీ క్లాస్‌మేట్ దివాకరం యిక్కడ వుంటున్నాడు. అదేదో వార పత్రికకు ఎడిటర్‌గా వుంటున్నాట్ట. నన్ను అతను చూచి నీవు ఫలాన శేఖరం తమ్ముడివి గదూ! యిప్పుడు మీ అన్నయ్య యెక్కడున్నాడు, ఏం చేస్తున్నాడు అని కుశలప్రశ్నలు

వేశాడు. నువ్వు వస్తే తనని కలుసుకోకుండా పోవద్దని చెప్పాడు' అన్నాడు తమ్ముడు.

దివాకరం తెలికగానే గుర్తుకు వచ్చాడు శేఖరానికి. అయితే అతను పత్రిక ఫీల్డ్‌లో సెటిల్ అయిపోయినాడన్నమాట -అనుకున్నాడు.

తన పనుల వత్తిడిలో ఒకనాడు తీరుబాటుచేసుకుని దివాకరం ఆఫీసుకు వెళ్లాడు శేఖరం. దివాకరం అతన్ని చూచి చాల సంతోషించాడు. తన సబ్ ఎడిటర్లకు పరిచయం చేశాడు.

'యేమీ రాయడం లేదా యీమధ్య? మా పత్రికకు కథేమయినా యిచ్చివెళ్లు యీసారి, అన్నాడు దివాకరం వొంటరిగా వున్నప్పుడు.

శేఖరానికి సిగ్గు అనిపించిది అయినా సమాధానం చెప్పాలి గనుక, యేమిటోరా నాకు రాయడం చేతకావడం లేదు. సరీగా సంవత్సరనాడు ఓ కథ రాసి నీ పత్రికకే పంపాను. అచ్చు కాలేదు. బహుశ బాగాలేదేమో' అన్నాడు.

'నాన్‌సెన్స్ నీ కథ బాగా లేక పోవటమేమిటి, అందులోనూ నేను ఎడిటరు అయినప్పుడు?' అన్నాడు దివాకరం. అనడమేగాకుండా గుమస్తాను పిలిచి శేఖరం పంపించానన్న నెలలో ఆ కథ వచ్చిందా, వస్తే యేమయింది వెదికి చెప్పమన్నాడు.

శేఖరం, దివాకరం దాదాపు మూడు గంటలసేపు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. తీరా శేఖరం బయలుదేరబోతూ వుండగా ఆ గుమస్తా పెద్ద రిజిష్టర్‌తో సహా వచ్చి దివాకరంతో యేమిటో చెప్పసాగాడు. దివాకరం శేఖరం వయిపు తిరిగి 'సారీ శేఖరం నీ కథతో పాటు హామీ పత్రం రాలేదు. అందుకని ఆ కథ నాదాకా రాకుండా చెత్త బుట్టలోకి వెళ్లిపోయింది' అన్నాడు.

'హామీ పత్రం యేమిటి?!'

'ఈ కథ నీ స్వంతమేననీ, దేనికీ అనుసరణ, కాపీకాదనీ, యింకే పత్రికలకు పంపలేదని ప్రతి రచయిత హామీ యివ్వాలని కొత్తగా రూల్ పెట్టాంలే యీమధ్య. ఏమంటే దేశంలో కాపీ రచయితలు ఎక్కువయి పోయినారు' యింకా యేదో చెప్పుకు పోతున్నాడు దివాకరం.

'నా కథ నాదేనని హామీ యివ్వాలా!

'అవును' నీవు స్వంత చిరునామా కవరు పెట్టినా నీకు తిప్పి పంపేవాళ్లు. పోనీలే నీదగ్గర కాపీవుంటే ఊరికి వెళ్లగానే పంపించు నాకు. దివాకరం చాల ఎపోలజెటిక్‌గా ముఖం పెట్టాడు.

'పోనీలే ఆ కథ రాలేదని నాకేం విచారంలేదు. నువ్వేం బాధపడకు' అంటూ శేఖరం బయటకు నడచాడుః

విజ్ఞప్తి

'అభ్యుదయ'కు సంబంధించిన ఉత్తరాలు, పంపే రచనలు ; మని ఆర్డర్లు, డ్రాఫ్టులు, చెక్కులు మొదలైనవి యీ దిగువ చిరునామాకు పంపవలసిందిగా విజ్ఞప్తి.

ABHYUDAYA,
R - 3, Llyods Estate,
Madras - 600 014

రచన, క్లోజ్డ్ సర్క్యూట్ టెలివిజన్

'అవంతి'

మనం వ్రాసే కథో కావ్యమో నవలో - ఏ రచన అయినా అది శుద్ధ మాటల పోగు ప్రప్రథమంగా.

కొంత మంది మాట్లాడుతుంటే విన బుద్ధి అవుతుంది. మరి కొందరు మాట్లాడుతుంటే చెవులు మూసుకొని లేచిపోబుద్ధి అవుతుంది. ఎందుచేత? ఎన్నుకొన్న పదాలు చెప్పదలచుకొన్న విషయం, దాని అమరికలో, ఆ విషయాన్ని వ్యక్తం చేసేందుకు ఏరుకున్న పదాలు, వాటి అమరిక కొంత వరకు చెవికి ఇంపుగా వుండటంలో వుంది రహస్యం. సరిగ్గా రచన విషయంలోనూ అంతే. భాషణలో మన లోపాల్ని సరిదిద్దుకొనేందుకు వీలులేదు. పెదవి దాటితే పృథివిని దాటేస్తుంది. కాని రచనలో ఆ అసౌకర్యం లేదు. దానిలో మన భావాల్ని, వాటి క్రమాన్ని వాటిని వ్యక్తం చేసే మాటల్ని, వాటి పొందికనీ ఒకటికి పదిమార్లు సవరించుకొని, అందాలు చూపించి, ఆకర్షణ సృష్టించ గలుగుతాం. శ్రీపాద సుబ్రమణ్యం శాస్త్రి గారు అచ్చయి పోయిన కథల్ని కూడా మళ్లి మళ్లీ సవరించి వ్రాసే వారు. ఆ విధంగా రచనల బాహ్య రూపం ప్రతిభ మీద కన్న ప్రజ్ఞ మీద అధికంగా ఆధారపడి వుంటుంది.

మనం మన రచనలలో చిత్రించేది మన చుట్టూ, మన అనుభవంలోవున్న, చూస్తున్న ప్రపంచాన్నీ, జీవితాన్నీను. అయితే ప్రపంచం, జీవితం మన రచనలలో లాగ ఒక క్రమంలో, కార్య కారణ సంబంధాలు, సామాజిక సంబంధాలు అమర్చపెట్టినట్లుగా, మానసిక ప్రవృత్తులు విస్పష్ట రూపంలో దర్శనం ఇవ్వవు. జీవితం పట్టాల మీద నడచి నట్లుండదు. వాస్తవ జీవితం ప్రమాదాలు, అశాంతుల మధ్య భయానకంగానో, ప్రశాంతి, అభ్యుదయాలమధ్య సుఖవంతంగానో వుండవచ్చు. కానీ, మనం వ్రాసే కథలోనో నవలలోనో కనిపించే ప్రతిరూపం వేరు. వాస్తవ రూపం లోని జీవితాన్నీ, దాని లోని ఘటనలనీ మన దృష్టిలోంచి జల్లించి, అమర్చి పెట్టి, చూపుతాము దీనిలో. ఆ జల్లించడం లోనూ, అమర్చడంలోనూ రచయిత కున్న భాషా పరిజ్ఞానం, భాషా సౌందర్యావగాహన కన్న ప్రపంచ విషయంలో, జీవితం గురించి అతనికిగల దృక్పధం ప్రాధాన్యం వహిస్తుంది. అంటే అతని జీవితదృక్పథం, వర్గ స్వభావం, రాజకీయ అభిమానాలు ప్రధాన స్థానం వహిస్తాయి. అతని పరిశీలనశక్తి, విషయ విస్పష్టత దీనికి ప్రధాన ఉపాంగాలుగానే వుంటాయి. దీనినే సాహిత్య పదజాలంలో మన విషయ వస్తువుగా పేర్కొంటాం.

ఈ విధంగా మన రచనలలో రూపానికీ, విషయ వస్తువుకీ కూడ సమాన

ప్రధాన్యం ఏర్పడుతుంది.

వీనిలో పాఠకులకి కనిపించే లోపాలు రచయిత శ్రద్ధా శ్రద్ధలకి విషయ పరిజ్ఞానానికే గాక ఆయన ప్రపంచ దృక్పథానికీ, సామాజిక అవగాహనకూ అద్దం పడతాయి. వానిని ప్రతిబింబిస్తాయి. రచయిత పాఠకుల నుంచి ఏ విధంగానూ దాగలేడు. అందు చేత విషయవస్తు ప్రకటనలో ఎంతో అశ్రద్ధ, నిర్లక్షం చూపుతూ లేకిగా వ్యవహరించరాదని మన రచయితలు గ్రహించ వలసి వుంది.

రచన అనేది స్విచ్ ఆన్ చేసిన క్లోస్డ్ సర్క్యూట్ టెలివిజన్ లాంటిది. దాని ముందు మనం నిలబడుతున్నాం!

పున్నమి చందమామ...ఖలీల్ జిబ్రాన్

నగరం మీదకు పున్నమి చందమామ వచ్చి, పిండార బోసినట్లుగా వెన్నెల కురిపిస్తున్నాడు. ఊళ్ళోని కుక్కలన్నీ చంద్రుణ్ని చూసి మొరగడం మొదలు పెట్టాయి.

ఒక్క కుక్క మాత్రం మొరగడం లేదు అది అంది గదా "చందమామని నిద్ర లేపకండి, మొరిగి మొరిగి చందమామని భూమికి రప్పించకండి."

కుక్కలన్నీ మొరగడం మానేశాయి. చీమ చిటుక్కు మంటే వినిపించే అంతగా నిశబ్దం. కాని మిగతా రాత్రుల్లా మొరుగుతూనేవుంది, నిశ్శబ్దంగా వుండమని కోరుతూ ఆ కుక్క.

టెలివిజన్ మహత్యం

"నిన్ను పిస్తోల్తో కాల్చాను. నువ్వు చచ్చావు!" ప్రతి ఆటస్థలంలోనూ యిటు వంటి అరుపు వినుపిస్తుందని, ఢిల్లీ నుండి పశ్చిమ జర్మనీ రాయబార కార్యాలయం ప్రచురించే "జర్మన్ న్యూస్" అన్న పత్రిక తన దేశంలో జరుగుతోన్న విషయాన్ని ప్రచురించింది. టెలివిజన్లో చూసిన దానినే ఆ పిల్లలు, పై విధంగా నటిస్తున్నారని ఆ పత్రిక తెలిపింది.

టెలివిజన్లో చూపబడే హింసాకాండను నిషేధించమనీ, పిల్లల కోసం యింత కంటే మంచి ప్రసారాలు చెయ్యమనీ బాలల రక్షణ ఉద్యమమూ, ఉద్యోగినుల సంఘాలూ కోరుచున్నా యట.

పిల్లలకు యిటువంటి టెలివిజన్ కార్యక్రమాలు చూసే అలవాటు తల్లిదండ్రులే చేస్తున్నారు. "టెలివిజన్లో రక్తం ప్రవహిస్తే, ఎవడికో ఒకడికి పెద్ద చిక్కు కలిగితే అదే వాస్తవికత" అని ఒక కుర్రాడన్నాడట. ఆడుకునే పిల్లలు, టి. వి తెరమీద చూసే హింసాకాండను వాస్తవం చేస్తున్నారట. పశ్చిమ జర్మనీలో 1950 నుండి 180 శాతానికి పెరిగిన నేరాలు యిందువల్లనే జరుగుచున్నాయని చెప్పబడుతోంది.
('జర్మన్ న్యూస్', 1978 మార్చి 30)

కథానిక

పరదా

చామర్తి దుర్గాప్రసాద్

సుందరమూర్తిగారికి, "తెల్లవారదు". "ఆకాశ భామిని అధరాలు విప్పుతుంది." పెదిమలు దొండ పండులా ఎర్రగా ఉన్నవని ఆయన అనరు. అది వ్యాఖ్యాతల పని. రచయితగా తను అలా విశదం చెయ్యగూడదు.

తొలకరి జల్లు, ఆయనకి సన్నజాజుల
రువ్వు
తారకలు, కన్నెల కేశరాసిలో విరిసిన మల్లెలు
వెన్నెల, పన్నెల నెరజాణనె నవ్వుల
దొంతర

ఆయనకి వాన కురవదు. "ఆకాశ సరసిలో నల్లని ఏనుగులు జలకాలాడుకుంటాయి".

పరదా వేసుకొన్న బొమ్మ ఆయన ఇంట్లో ముందుగా కనబడుతుంది, ఎవరికయినా వెళ్ళగానే.

ప్రజల కష్టాలు కాయన చలిస్తాడని వ్యాఖ్యాతలంటారు.

"రాజు దుడుస్తున్నాడు కిరణాల
వెల్లువ
ప్రజలు కారుస్తున్నారు బాష్పాల
కాలువ"

రాజుగారు సంతోషించారు. ఎవరో కొందరు వ్యాఖ్యాతలు రాజు అంటే చంద్రుడనీ, బాష్పాలంటే ఆనంద బాష్పాలని చెప్పారు. ప్రజలూ సంతోషించారు, మరి కొందరి వ్యాఖ్యానం విని.

పరదా వేసికొన్న బొమ్మ అందమైన
స్త్రీమూర్తిది.

విప్లవం కోసం కొందరు ప్రయత్నించి నప్పుడు - ప్రభుత్వం వారిని ఊచ ముట్టగా నరికి నప్పుడు ఆయన రాశారు :

"నేలని చీల్చి పెకలించిన తర్వాతే
నాటాలి విత్తు
అవుడు విత్తు మొలుస్తుంది - నిలు
స్తుంది కలకాలం
విత్తు మొలుస్తుంది తల్లి లాంటి నేల
రొమ్ము తన్ని
నిలుస్తుంది తన నీడలో మరో
విత్తుని తలెత్త నివ్వకుండా".

పరదా లోంచి చూస్తే అవయవాలు ప్రస్ఫుటంగా కనబడతాయి చూడ కలగాలే గాని,

సాంఘిక దురాచారాల మీద ఆయన రాశారు ఒకసారి:

"ఇచ్చిపుచ్చుకోవడంలో కట్నాల
ప్రసక్తి
కలిగించదు నాకు ఏమాత్రం
ఆసక్తి".

ఇంత సూటిగా వ్రాశారేమా అని ఆశ్చర్య పొయ్యారు వాఖ్యాతలు. తన కూతుళ్ళకి కట్నాల్లేకుండా దండ మూర్పులతో పెళ్ళిళ్ళు చేశారు ఆయన. తన కొడుకులకి "జరిగై" పెళ్ళిళ్ళు ఘనంగా. కట్నాల్లేవు. ముద్దూ ముచ్చటలు మాత్రం నెరవేర్చారు అవతల వారు. వ్యాఖ్యాతలు అప్పుడు గ్రహించగలిగారు ఆయన వాక్యాల్లోనూ గుంభ

నగా పరదా ఉందని. అందుకే అడిగారు "స్వామి చెప్పండి సూటిగా" అని. ఆయన నవ్వారు. "రాయటం నావంతు - తల పగల కొట్టుకోవడం మీ వంతు" అన్నట్లు. నవ్వు ఆయనకి పరదా.

ఆ అందమయిన బొమ్మని కొంచెం పక్కగా చూస్తే రాక్షసిలా కనబడు తుంది - పక్క చూపులు చూడరే ఎవ్వరూ పెద్దమనిషి లక్షణం కాదు కనక.

"యజమాని సూర్యుడు. కార్మిక నాయకుడు చంద్రుడు" అని అన్నా రాయన ఒకసారి. యజమానులూ, కార్మికులూ సంతోషించారు. కార్మిక నాయకుణ్ణి, యజమాని కావాలని పెంచి పోషిస్తున్నట్లుగా ఎవరో ఒక వ్యాఖ్యాత అర్థం చెప్పాడు. సుందర మూర్తి గారి నవ్వు క్షణకాలంలో మాయమై మళ్ళీ వెలిగింది.

ప్రభుత్వాలు మారినా ఆయన మాత్రం ప్రజాకవే. అలానే ప్రభుత్వ సన్మానాలూ ఆయనకే.

ప్రజాస్వామ్యం బురఖా వదిలి, నియంత బయట పడిన రోజున ఆయన రాశారు:

"స్వేచ్ఛకీ, ఎగిరే గద్దకీ హద్దు లేమిటి
సొంత గొంతులో ఎదురు గాలి వేగం తప్ప'.'

ప్రజలు ఈ వాక్యాలకి ఎక్కడ లేని ప్రచారం ఇచ్చారు. నియంత మూర్తి గార్ని పిలిపించి తల తీయించ మన్నాడు తన అనుగ్రహంకోసం వినయంగా నిలుచున్న గృహమంత్రితో.

మూర్తి గారు పరదా పారేసి లబో దిబో మన్నారు. తన వాక్యాలకి తనే అర్థం చెప్పారు. "స్వేచ్ఛకి హద్దు గొంతుక. అభిప్రాయాలను గొంతులోనే అది మేసుకోవాలి. గద్ద ఏలిన వారికి చిహ్నం. గద్దకి హద్దు ఎదురు గాలి శక్తి. కనక ఆ శక్తిని అణచడం తవరికి చెల్లు."

నియంత సంతోషించాడు. అయితే ఆయన మాట పట్టింపు మనిషి. "ఈ మాత్ర మింగేసి మరణించండి. రాజలాంఛనాలతో సాగనంపుతాం".

మూర్తిగారు గోలు మన్నారు. "నన్ను చంపకండి. అశక్తుణ్ణి, ఒకరికి అపకారం గానీ ఉపకారం గానీ చెయ్యలేనివాణ్ణి".

మూర్తిగారు వదిలేసిన పరదా నియంత మీద వేసుకొన్నాడు.

"అపకారమూ ఉపకారమూ చెయ్య లేక పోవడం భగవంతుడి లక్షణం. మీరూ దేవుళ్ళాంటి వారు. మన దేశంలో మీలాంటి వారిని గవర్నరుగా వేయడమో, పరదేశాలకు రాయబార్లుగా పంపడమో మర్యాద. మీరు దేవుడు కనక స్వర్గానికి మా రాయబారి. మీరు వృద్ధు లయ్యారు. కనక స్వర్గానికి వెళ్ళి నిత్య యవ్వనులై రంభాసంభోగంలో తేలండి".

"మరణించే ముందు ప్రజా కవి మూర్తి గారు,
జనులారా! ఒక మాట అన్నారు
ప్రజల మంచికే నియంతృత్వం
నియంత లోపల అనంత మయిన కారుణ్యం ఉంది
పరదాలో బొమ్మ ఎంతో అంద మయింది

నేరుగా చూడడం నేర్చుకోండి –
నెగ్గుకొస్తారు.
పక్క చూపులు చూడకండి –
పాడై పోతారు''.

ఓ కుర్ర కవి ''తన గొంతులో పెట్టిన'' వాక్యాలు విని మూర్తిగారు అవాక్కయ్యారు. ఏడ్చారు. ఆ ఏడుపు ఆనందం కాదని అనబోయ్యారు. అనలేక పోయారు.

మూర్తిగారి గొంతుక పడి పోయింది

''స్వేచ్ఛకి హద్దేమిటి? సొంత గొంతుకి తప్ప.''

* అద్దాలు *

చాగంటి రామరావు

అద్దాలివి అద్దాలివి
సన్నపాటి అద్దాలివి
రోడ్డుమీద విసిరేసిన
ముక్కలైన అద్దాలివి
రిక్షాలో సీటుక్రింద
గుడిసెలోని గోడలోన
తాపడించినద్దాలివి
గీకేయగ మిగిలినట్టి
శిథిలమైన కళాయితో
చీకటిలో చీకిపోయి
ఊగులాడు అద్దాలివి
నేనవ్వీన నవ్వులందు
నిట్టూర్పులై ప్రతిఫలించు
నేపల్కిన పల్కులందు
రోదనలై వినిపించును
నేనేడ్చిన యేడ్పులందు
అపహాస్యములై ధ్వని
యించును
నా కన్నుల ధవళకాంతి
బాధారుణ దీప్తమగును

నా తనువున అంబరాలు
పీలికలై వెక్కిరించు
నా మేనున సౌగంధము
ఘర్మవాసనలు జిమ్మును
నారూపం వాటిలోన
నగుబాటై కనిపించును
నా రూపం వాటిలోన
జీవచ్ఛవమై కదులును
పగిలిన ఈ అద్దాలతో
బాటంతా నిండిపోయె
జగమంతా నిండిపోయె
నా రూపం నన్నుజూచి
పరిహసించి పరిహసించి
శాపమిచ్చి తాపమిచ్చి
అరిమి తరిమి తరిమి తరిమి
చెండాడును చివరికింక
నా రూపం నన్ను పట్టి
చంపేయును చివరికింక
నా రూపం నన్ను పట్టి
తినివేయును చివరికింక.

అద్దాలివి అద్దాలివి
రంగు రంగు టద్దాలివి
రకరకాల అద్దాలివి
పెద్ద పెద్ద అద్దాలివి
కార్లలోన, మేడలలో
నింగినంటు హర్మ్యాలలో
బంగారపు ఫ్రేములలో
నీటుగా బిగింప బడ్డ
ఒకేవైపు దట్టంగా
కళాయున్న అద్దాలివి
కదలిక లేనద్దాలివి
నేనవ్వీన నవ్వావవి
నేపల్కిప పల్కావవి
నేనేడ్చిన యేడ్వావవి
నా రూపం వాటిలోన
వికృతమా నెందుచేతో?
నా రూపం వాటికేలో
కనిపించద దెందుచేతో?
నా రూపం వాటిలోన
పడనీయవ దెందుచేతో?
నా రూపం వాటిలోన
ప్రతిఫలించ దెదుచేతో?

చలనచిత్రాల ప్రభావాలు - కొన్ని భావాలు

భాస్కర వేణుగోపాల్

పెళ్ళికాని మీ పందొమ్మిదేళ్ళ కూతురు, పొద్దున్నే బాత్‌రూంలో చేరి "అమ్మమ్మో చలి చలి చలి - కావాలోయ్ వెచ్చని కౌగిలి" అని పాడుతూ వుంటే మీకెలా వుంటుంది?

పదేళ్లు నిండని మీ పసిపాప గెంతుకుంటూ "నాకు ఉడుకెత్తి పోయింది" అని పాడుకుంటూ ఇంట్లోకి వస్తే మీకెలా వుంటుంది? మీరు,మీ స్నేహితుడూ హాలో కూర్చొని వుంటే, పక్కనే వున్న వంట ఇంట్లోనుండి మీ ఆవిడ "చూపవా నీ మగ సిరి..." అని కూని రాగం తీస్తూ వుంటే, అది మీ ఇద్దరి చెవుల్లో పడుతూ వుంటే, మీ స్నేహితుడి కెలా వున్నా, మీకెలా వుంటుంది? ఆ పరిస్థితి -నేటి సగటు తెలుగు జీవితానికి, తెలుగు చలన చిత్రాలిచ్చిన బహుమతి.

కళ్ళలోకి తొంగి చూడటం, ఒకరినొకరు హత్తుకుపోవడం, కౌగిట్లో కరిగిపోవడం, మైమరచి పోవడం, కైపెక్కడం, వెచ్చని వెన్నెల, వేడి నిట్టూర్పులు, ప్రేమ, వలపు, విరహం - ఉగ్గుపాలంటే మన పిల్లలెవ్వరికి తెలియదేమో కానీ, ఉగ్గుపాల నుంచీ మన పిల్లలకీ పదాలు, అవి సూచించే విషయాలు సుపరిచితాలనడం అతిశయోక్తి కాదు! అయిదో తరగతి కుర్రాడు, ఆరో తరగతి కుర్రదానికి, "ఎన్టీ రామారావు జయప్రదను ప్రేమిస్తాడు" అని కథ చెబుతాడు; "సత్యనారాయణ ప్రభను బలాత్కారం చేసే" సీను వివరిస్తాడు. పదో తరగతి పాసుకాక ముందే "ప్రేమించి" "విఫలమైన" పిల్లలు ఈనాడు తెలుగు దేశంలో కోకొల్లలు. ఎనిమిదో తరగతి కుర్రకుంకలు కూడా లవ్ లెటర్లు రాయగలరు. ఫస్ట్‌డే సినిమా ముఖ్యమా, పరీక్ష ముఖ్యమా అన్న విషయాన్ని బొమ్మా బొరుసూ వేయకుండానే బొమ్మేనని నిర్ణయించుకోగల రసజ్ఞత మన చిన్నవాళ్ళకుంది. ఇహ వున్నత విద్యాలయాల్లోని వారి హృదయౌన్నత్యాన్ని గురించి మాట్లాడాల్సిన పనే లేదు. ఈ అభ్యున్నతిని మనకు సాధించి పెట్టిన ఘనత, తెలుగు నవలలది కాదు, తెలుగు పత్రికలది కాదు, పాఠశాలలది కాదు, రాజకీయ వేత్తలది కాదు. వాళ్ళెవరికీ అంత శక్తి లేదు. ఇది పూర్తిగా తెలుగు సినిమాలది.

సాహిత్యం సమాజానికి దర్పణం. సినిమా ఒక సాహిత్య శాఖే గనక, నేటి తెలుగు చిత్రాలు తెలుగు సమాజ జీవితాన్ని ప్రతిబింబిస్తున్నాయా లేక ఏవో కొన్ని అపరిపక్వ మేధోజనిత విపరీత భావనలకు మాత్రమే రూపకల్పనా అన్నది చర్చించవలసిన విషయమే అయితే, అటు పరిశ్రమలోని వారికందరికీ సుఖ

శాంతు లివ్వలేకపోగా, ఇటు సమాజానికి హానికరంగా పరిణమిస్తున్న ఈ 'సినిమా' అనేది మనిషి మనసును రంజింపజేసి అతని దగ్గరున్న ధనాన్ని 'సంపాదించేసుకో'' డానికి వుపయోగ పడుతున్న కళాత్మకమైన వ్యాపారమనేది నేటి నిజం.

భావ ప్రకటనా స్వాతంత్ర్యం వుండాల్సిందే. కానీ, ప్రకటించినవి భావమైనా, ఎవరిమీద ఎలాంటి ప్రభావం కలిగిస్తున్నదో గమనించడం ఆ భావ ప్రకటనా స్వాతంత్ర్యం కన్నా ముఖ్యమైన విషయం. అందువల్ల సాహిత్యంలోని ఏ శాఖలోనైనా కృషి చేస్తున్న వారందరికీ, సమాజంపట్ల తాము నిర్వహించ వలసిన బృహత్తరమైన బాధ్యతొకటి వుంది. ఆనందానికి – ఉద్రేకానికీ, ఉల్లాసానికీ – ఉత్తేజానికీ తేడా వుంది. మోతాదుకు మించిన అహ్లాదం ఎప్పుడూ సత్ఫలితాలనివ్వదు. మానవుణ్ణి కర్తవ్యోన్ముఖం చేయడానికి అహ్లాదకరంగా ప్రబోధించవలసిన సాహిత్యం, నచ్చజెప్పాలే కానీ, రెచ్చగొట్ట కూడదు. భావ ప్రకటనకూ, సమాజాన్ని ప్రభావితం చేయడానికి ఈ రోజు సినిమాను మించిన సాధనం లేదు. సినిమా రంగంలోని వ్యక్తుల పట్ల సాధారణ ప్రజలు ప్రకటించే అభిమానం, భక్తి, శ్రద్ధ అసాధారణమైనవి. ఈ మధ్య విరాళాల కోసం తారలు వీధుల్లో తిరిగి నప్పుడు చేరిన జనసందోహం, అమాయకంగా, దాదాపు మూర్ఖంగా ఆ జనం తమ అభిమాన తారల దర్శనం కోసం, వాళ్ళ చేతికి తమకున్న కొద్దో గొప్పో అందివ్వడం కోసం విరగబడటం ఇందుకు స్పష్టమైన ఉదాహరణం.

అసభ్యత అందం కాదు; అందమే వున్నచోట అసభ్యతకు స్థానమూ లేదు, అవసరమూ లేదు. కథలో పటుత్వంలేక, కథ చెప్పడం చేతగాక, బూతులుంటేనే గానీ పాటలు, మాటలు 'రస' వత్తరం కావనీ, జనం మెచ్చరనీ, మొహంలో భావాలు చూపించడం చేతగాని తారల ఇతర భాగాలు మాత్రమే చూపించి, శృంగారమంతా రాక్షసమనీ, నగ్నత్వమంతా సౌందర్యమనీ – మన సినిమా కవులు, నిర్మాతలు, దర్శకులు భావిస్తున్నట్లున్నారు.

పరీక్ష రాసిన తర్వాత సినిమా చూడటం, ఈ రోజుల్లో సాంఘిక న్యాయం! పరీక్ష రాసిన చెల్లి ''అన్నయ్యా, సినిమాకు తీసికెళ్ళరా'' అంటే భయం! ఆ చిన్నపిల్లతో పాటు వెళ్ళి కూర్చొని, ఆ రెండర్థాల రచనలు వినడమూ, ఆ తారల అర్ధనగ్న శరీర విన్యాసాలు కనడమూ మనవల్ల నవుతుందా అని! కుటుంబ చిత్రమని పేరు. అయితే అంత బరితెగించిన దృశ్యాలు చూపడం చిత్రమే! ఆ తొడలూ, కాళ్లూ పెట్టి ప్రత్యేకంగా కొన్ని రీళ్లు అతుకేసుకొని విడుదల చేసుకోవచ్చు కదా. అదే కావలసిన వాళ్ళు దాన్ని పదిసార్లు చూసి ఆనందిస్తారు! రకరకాల రుచులున్నాయి కదా అని, అన్ని రకాలవాళ్ళనీ సంతృప్తి పరచాలనే ఆత్రంకొద్దీ, ఇలాంటి కలగాపులగాలు తయారుచేసి దాన్ని

చంటి పిల్లలు మొదలూ, పెద్దవాళ్ళ వరకూ అందరికీ ఏక పంక్తిన వడ్డించడం— ఒక విధమైన 'శాడిజం' కాబోలు. భోజనం వేళ; కొంపలో అన్నాచెల్లెలూ, అక్కాతమ్ముడూ, తండ్రీకూతురూ, తల్లీకొడుకులూ, అందరూ కూర్చొని అన్నం తింటూ, రేడియోలో ఏమొస్తూ వుందో అని ఆన్ చేస్తే, "లోపలి కొస్తారా .... చూస్తారా!" అని మన ఉత్తమ గాయని గొంతు! ఆ పాటమీద, అది రాసిన వాడిమీద, రాయించిన వాడిమీద, దానికి తగుదునమ్మా అని స్వరాలు వేసిన వాడి మీద, పాడిన వాళ్ళ మీద ప్రసారంచేసే రేడియో వాళ్ళమీద – జుగుప్స కలగాలి; లేదా, తెలుగు వాళ్ళంతా యిటువంటి పాటల్ని వుమ్మడిగా పాడుకునే స్థాయికి చేరుకున్నారా?

సాంకేతికంగా నేటి మన చిత్రాల స్థాయి, చాలా వున్నతమైనది. గాయకులుగా, సంగీత దర్శకులుగా, ఛాయా చిత్ర గ్రాహకులుగానే గాక, శబ్ద గ్రహణం, ఎడిటింగ్, కళ వంటి తదితర శాఖల్లో కూడా, మనవారు మంచి నేర్పు సంపాదించి వున్నారు. ఈ నేర్పును, ఈ శక్తివంతమైన కళను, సమాజం ఆరోగ్యకరమైన రీతిలో ఎదగడానికి, పురోగమించడానికి ఎందుకు వుపయోగించరు?

కోపమొస్తుందేమో కానీ, మన పరిశ్రమలోని వారికి మన చిత్రాల్లో చూపించే విచిత్రాలు – ప్రేక్షకులకు – కనీసం అందులో కొందరికి, అనిపించినంత అసభ్యం కావు కాబోలు! వారి సాంఘిక స్థాయి వేరు!

మనిషన్న తర్వాత బలహీనతలు సహజం. ఆ బలహీనతలను రూపుమాపు కొని ఉన్నతి సాధించడానికి ప్రయత్నించాలి. ఆ బలహీనతలనే ఆసరా చేసు కొని, వాటినే రెచ్చగొట్టి, మనిషిని కొల్లగొట్టే ప్రయత్నం చేయడం, వాళ్ళు మరీ మరీ చూస్తున్నారు గనుక, మేమిలాగే తీస్తూ వుంటామని అనడం ఎంత వెనుక బడిన, అనాగరికమైన సమాజమైనా క్షమించ కూడని నేరం! ఈ పాపం, బాధితుల కోసం బజార్ల వెంట తిరిగి విరాళాలు వసూలు చేయడంతో మాపు కాదు.

"వీళ్ళెవరో చెప్పుకో" మల్లాది వెంకట కృష్ణమూర్తి

వాళ్ళెవరో చెప్పుకో.
పస్తులే వాళ్ళ ఆస్తులు
బాధలే వాళ్ళ గాథలు
లెక్కలే వాళ్ళ రొక్కం
కండలే వాళ్ళ కలిమి

పోనీ, వాళ్ళెవరో చెప్పుకో.
దోపిడే వారి వూపిరి
స్వార్థమే వారి పరమార్థం
ధనమే వారి కులం
కనకమే వారి బలం

కాలం విలువెంత?

సోమసుందర్

మహాపురుషులూ, కాపురుషులు

వాస్తవ జగతు మృత్తికామయ భూతలం.... మహాపురుషుల అవతరణమో - భూజాల మాదిరి నిరాడంబరమే! సమస్తా శాఖకాశాలకూ కొమ్మల్నీ, రెమ్మల్నీ విస్తరిస్తూ ... జగత్తుకు ప్రాణవాయువు లందిస్తూ...హరిత కాంతుల్ని ప్రసాదిస్తూ...నీరదాల పయ్యెదల్ని పట్టి లాగుతూ... అమృత ధారల్ని అనుజులకందరికి అందిస్తూ నిరాడంబరంగానే జరుగుతుంది!

కాని వనస్పతు లెంత గొప్పవైనా ఒకానొక విపత్కర ఝంఝూప్రభంజనానికి కదలి, కూకటి వ్రేళ్ళతోసహా కూలిపోక తప్పదు.

అప్పుడా కూలిన చెట్టు స్థానం శూన్యం కాక తప్పదు!

మహాపురుషుల మరణానంతరం వారి ప్రభావాన్ని అనుగామి లోకం ఎంతని నిలుపుకో గలుగుతుంది?

ఈ లోకం సదా మృత్తికా స్నాత కశ్మలం: అజ్ఞాన తమో నిర్భరం: భౌతికేచ్ఛా పరంపరాభి సంకులం: కాపురుష సందోహ కాకోలూకీయం ...

మహత్త్వాన్ని స్పర్శించే శక్తి చర్మ దర్వీకరాలకుందా?. స్థూలస్వరూపంలో గోచరంకాని దానిని వీక్షించే శక్తి చర్మ చక్షువులకుందా?... ఏమో - సందేహమే: వెలుగుకీ వెలుగుకీ నడుమ పరచుకొన్న చీకటి కడలిని తరించడానికి — నిద్దుర తెప్పల్ని సాధించిన జీవులు ... మరపుల తెడనీ, కలల తెర చాపల్నీ సంధించిన జీవులు...అవతలి తీరంలో అందుకొనేదేమిటి?

తమ కూడా దింపుకోగలిగే సంచిత స్మృతులెన్ని.

వ్యక్తి...లోకం

బుద్ధదేవుని నఖాస్థికలపై నిర్మించిన స్థూపాలనో, చైత్యాలనో తిలకించనంత మాత్రంలో ఆ ప్రాసాదాల పరిసరాలలో మనసు నొలికించినంత మాత్రంలో, శ్రావణ బెల్గోలా జినదేవుని మహాస్వరూపాన్ని దర్శించి స్పర్శించినంత మాత్రంలో, ఆ పవిత్రావరణాల ప్రాణవాయువులను పీల్చి గుండెలు నింపు కొన్నంత మాత్రంలో ... మామూలు మనిషి మహాత్ముడవుతాడన్న దాఖాలా ఏమిటి?

వ్యక్తికీ లోకానికీ అపార తేజస్సులందాయన్న నిదర్శనమేముంది? అభౌతి కాలను భౌతిక ప్రమాణాలతో కొలిచే సాధనమేముంది?

వ్యక్తిగత చైతన్యంతో మనిషి ఆర్జించుకొనే—మానసిక పరిణామం అంచనాలకు దొరికేది కాదు; చిద్రూపావేశానికి పరిమితి లేదు.

మహమ్మద్ ప్రవక్తగెడ్డంలోని కేశాన్ని భద్రపరచి నిర్మించిన, దర్శించిన పామరుడు మాన్యతర పారమ్యతల నందగలడా?

మనిషి స్థౌల్యంతో రాని మార్పు-

సూక్ష్మంలో సంభవించిందని ఎలా నిరూపించడం? పరిపక్వత నెలా మదించడం? చైతన్య స్వరూపాన్ని ఎలా నిర్వచించడం ?

లోకాన్ని విమర్శించినంత మాత్రాన అరిషడ్వర్గాల కంటక చక్ర దాష్టిక బంధం తొలగిందని ఎలా చెప్పగలం ?

తెగిందా ఆశాపాశం? దురాశా తమి' స్రార్భాటం ?

జరరుజల తృష్ణావర్తనంలో జగత్తు-సదా పోకార్చుకుంటూనే ఉంటుంది మహత్తు !

జడమయ వాస్తవికతల పాషాణో పరితలం బారిపడిన యోచనా సరిత్తు తప్తమవుతుంది....

గగనం క్రక్కే వేడి నిట్టూర్పులకు సౌజన్య ప్రాలేయం సంతప్తమవుతుంది. అమృత లేశమైనా దుమ్ముకణంగా మారిపోతుంది.

అవిరిని ఆలింగన మొనర్చినా అర్ధ9ం కాలేక, ఎండిన ఎడారి ధూళిగా మారి, పరిసరాలను దూసరితం చేస్తుంది. గాలికి మారుమ్రోగుతుంది. శూన్యావరణం.... వ్యక్తికి...లోకానికీ-చివరికి సంక్రమించేదేమిటి ?

కాంతిలత

నరహృదయం జిఘాంసాధీనమైన విపత్తు...దుఃఖక్లేశాల సమస్త భారమూ దేవాలయ శిల్పశక్తితో నశించలేదు. అలాగే-ఈశ్వర పుత్రుడైన జీసస్ అవతరణతో ప్రేమైక సామ్రాజ్యం అవతరించలేదు. దురాశా వర్తాలను తరిం: లేదు. దుష్కారహృదయ శూన్యాటవీస చారం విరమించలేదు.

అనవరత భ్రష్టస్వరూపమైన లో హృదయాన్ని ప్రతిబింబించాలని క త్వాన్ని ఆజ్ఞాపిస్తారు మూర్ఖులు. కవిత్వ మంత్రజలమై సమస్త కల్మషాని సద్యోనివృత్తి చేయగలదని ఆశిస్తా జడభరతులు.

అదే కర్తవ్యమైతే-సృజనశక్తి ఎం కంగాళీగా మారేది !

తనచుట్టూ తాను తిరిగే గానుగెద్దు పురోగమనం కానరాక, ఎంత నిరాశా ధకారం వ్యాపించేది!

కవిత్వమో-ఎంత అస్తవ్యస్తంగ పరిణమించేది !

మానవ మనీషా దరస్మితరుచి రేఖలనందుకొని, అగతకాల చారువ నానికి ఉపాదేయమైతే-కవిత్వం పూ తీరదా ? కసితో కశాఘాతాలు విస డమే తరుణోపాయమా ?

కవితాసతి కెంబెదవి జండా తళ కలకోసం-ఆమె హృదయ సురభి శీతల తరంగాలకోసం - సహృదయ హృదయావేశం సంసిద్ధమైతే చాలదా '

కాంతిలతల్ని సర్వత్రా పరిపోషిం డం కోసం, ధ్యానైకతపోనిష్ఠ అలవచ్చి కుంటే చాలదా ?

కవితా శతారధారల ధగద్ధలతో . రేపటి లోగిళ్ళకు ఆరోగ్యక తూలాలు ప్రసాదిస్తే చాలదా ?

(9, 10, 11 పర్వాలు)

వార్తా సంగ్రహం

ఏప్రిల్ 5 ఆది వారం సాయంకాలం 6 గంటలకు పొట్టి శ్రీరాములు మెమోరియల్ హాలు (మద్రాసు) లో మద్రాసు అరసం శాఖ అధ్వర్యాన స్వీయ కథా పఠనం, కథల మీద గోష్ఠి జరిగేయి. ఎనిమిది మంది కథకులు బి. నాగరాజు, టి. ప్రసన్నకుమార్ వై. వి. యస్ ఎస్. మూర్తి, ఎ. బి. శాయి ప్రసాద్, ఉపద్రష్ట శాయి, బి. హెచ్. సాంబ మూర్తి, సి. డి. ప్రసాద్‌గార్లు తమ తమ కథలు చదివేరు. ప్రసాద్‌గారి కథపై సభలో చర్చ జరిగింది. (దానిని ఈ సంచికలో వేరొక చోట ప్రచురిస్తున్నాం.) బి. నాగరాజు, బి. హెచ్. సాంబమూర్తిగార్ల కథలపైని సభ్యులు చాలమంది తమ అభిప్రాయాలు తెలిపి సూచన లిచ్చారు.

గాధా సప్త శతిలో తెలుగు పదాలు

పై శీర్షికతో ప్రాకృత అకాడమీ అధ్యక్షుడు తిరుమల రామచంద్ర రచించిన పరిశోధనా గ్రంథాన్ని మార్చి 26 న, హైదరాబాదులో వాణిజ్య మంత్రి శ్రీ టి. హయగ్రీవాచారి ఆవిష్కరించారు. సురవరం, గద్వాల, వనపర్తి వంటి పూర్వపు సంస్థానాలలో చాలా ప్రాకృత గ్రంథలున్నాయని, వాటిని ప్రాకృత అకాడమీ సేకరించాలనీ డాక్టర్ రామరాజు సూచించారు.

చివరి స్థానం నాటకాలది

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం 21 వ స్నాతకోత్సవ ప్రసంగం (మార్చి 24 న) చేస్తూ కేంద్ర సాహిత్య అకాడెమీ అధ్యక్షుడు శ్రీ ఉమా శంకర్ జోషీ యింతవరకూ సాహిత్య అకాడెమీ బహుమానాలు పొందిన 290 గ్రంథాలలో నాటకాలు తొమ్మిది మాత్రమే ఉన్నాయని చెప్పారు.

కవిత్వం : లయ గతి

కేంద్ర సాహిత్య అకాడెమీ దక్షిణ ప్రాంతం కార్యాలయం అవరణలో (మద్రాసు) మార్చి23 న ఫ్రెంచి కవయిత్రి మదాం జెన్నీహరోల్ట్ ''కవిత్వ లక్ష్యం'' నేఅ విషయం మీద ప్రసంగించేరు. లయ గతిప్రకృతి నిబద్ధమనీ, మానవ జీవిత రంగాలన్నింటా కూడా ఆ లయ గతి కనిపిస్తూందనీ, కవిత్వానికి కూడా అదే ప్రాణమనీ ఆమె తమ ప్రసంగంలో వివరించేరు. ఒక శ్రోత ప్రశ్నకు సమాధానం చెపూవచన కవిత అనేదిలయబద్ధత లేకపోవడం చేత దానిని కవిత్వంగా అమోదించలేమన్నారు.

ఆకాశవాణి స్వర్ణోత్సవం

అకాశవాణి స్వర్ణోత్సవ సభలో (ఢిల్లీలో మార్చి 30 న) ప్రసంగిస్తూ రాష్ట్రపతి సంజీవ రెడ్డి రేడియో ప్రసార కర్తవ్యం శ్రోతలను అనందింప జేయడమూ; ఆర్థిక, సామాజిక ప్రగతిక తోడ్పడడమూ నని చెప్పారు. ఈ ప్రసార సాధనాన్ని దుర్వినియోగం చెయ్యరాదని, అది జాతీయ సమైక్యతకు సాధనంగా వుండాలనీ రాష్ట్రపతి అభిలషించారు.

అకాశవాణి ప్రారంభకాలం నుండీ దానితో సంబంధం కల కళాకారులను రాష్ట్రపతి సన్మానించారు. వీరిలో పాకిస్తాన్‌కు చెందిన బేగం మాలికా పుఖ్రాజ్, రోషనారా బేగం ఉన్నారు.

మళ్లీ కన్నడ చిత్రానికి అగ్ర తాంబూలం

కన్నడ కథా చలన చిత్రం 'ఘటాశ్రాద్ధ' కు ఉత్తమ చిత్రంగా (స్వర్ణ కమలం) ఎన్నికయ్యింది. వృద్ధ చలన చిత్ర దర్శకుడు నితిన్ బోస్, దాదా సాహెబ్ బహుమతి స్వీకరిస్తారు.

ఉత్తమ సంగీత దర్శకత్వానికి బి. వి. కరంత్, ఉత్తమ బాలనటునిగా అజిత్‌కు మార్ ఎన్నికయ్యారు. వీరిరువురూ 'ఘటాశ్రాద్ధ' కు సంబంధించిన వారే.

ఉత్తమ హిందీ చిత్రంగా సత్యజిత్ రే 'షత్రంజ్ కే ఖిలారీ', ఉత్తమ తెలుగు చిత్రంగా మృణాల్ సెన్ 'ఒకఊరి కథ' ఎన్నికయాయి.

లేఖలు

మధ్యతరగతులు – సమ్మెలు – విప్లవాలు

రా. వి. శాస్త్రిగారి కథల మీద మార్చి 5 న ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ జరిపిన చర్చలో, ఆయన కథ 'వేతన శర్మ' పైని వివిధాభిప్రాయాలు వచ్చాయి. ఎన్. జి. ఓ. ల్లాంటి వాళ్ల సమ్మెలు విప్లవంలో భాగం అనుకొని, వాటివల్ల విప్లవం ముందుకు పోయిందనుకొనటం మూలాన, ఆ కథలో ఆయన చూపిన లోపాన్ని, ఆ ఉద్యమాన్ని నష్టపరచడం లాగా అనిపించింది కొందరికి. మధ్య తరగతి సమ్మెలు విప్లవం అనుకొన్నా, అందులో "నాయకుల్ని కొనగలరు" అని చెప్పడం నిర్మాణాత్మకమైన విమర్శ అని నేను అనుకొంటున్నాను.

అసలు సమ్మెలు విప్లవమా ? దేశంలో 5 శాతం డబ్బున్నవాళ్ళు, 15 శాతం మధ్యతరగతి, 80 శాతం పేదలు (శ్రామికులు) ఉన్నారనుకుందాం. డబ్బులో 90 శాతం, పై 5 శాతం దగ్గర వుండి పోయిందనుకుందాం. ఈ సమ్మెల మూలాన ఆ 90 శాతం డబ్బు 15 శాతం మధ్య తరగతి ప్రజల్లోకి వస్తే, కనీసం ఆ దిశగావుంటే – యిది విప్లవం అనే అనాలి. ఎందుకంటే, ఒకసారి మధ్య తరగతికి వచ్చిం తరవాత అక్కణ్నుంచి శ్రామికులకి చేరడం రెండవ దశ కనక.

అయితే అలా డబ్బు మధ్య తరగతికి చేరకం పై 5 శాతంలోనే కేంద్రీకరింపబడడం కొనసాగుతున్నప్పుడు, యీ సమ్మెల్ని విప్లవం అనలేము. దేశంలోని అభివృద్ధి పై 5 శాతం వశం అవుతూన్నట్టు లెఖ్ఖలు రుజువు చేస్తున్నాయి. కనక డబ్బున్నవాళ్లు తమ అస్తిత్వానికి భంగంరాని విధంగా మధ్య తరగతికి ఎండు గడ్డి పరకలు మరో నాలుగు వేస్తున్నారనీ, ఆ పరకల కాశపడి స్వార్థం మూలంగా మధ్య తరగతి పెట్టుబడి దారీ వర్గంను బలపరచడానికి సాయపడుతూన్నదని అనుకోవడంలో కుతర్కం ఏముంది ? కనక యిది విప్లవ మార్గం కాదని నా అభిప్రాయం. ఈ మార్గం మీదే నమ్మకం లేదు నాకు. సమ్మెల వలన కరువు భత్యం పెరగడం చూసి మధ్య తరగతి మోసపోతున్నదే గాని, అందువలన అభివృద్ధిలో అది పాలు పొందడం లేదని చెప్పడం రచయితగా నా కర్తవ్యం. ఇది విప్లవం కాదని రుజువు చేయడము (లెఖ్ఖలమూలంగా) కర్తవ్యమే.

ఇది విప్లవం – యిదే విప్లవం – మరో మార్గం లేదు అని అన్ని రాజకీయ పార్టీలు అనడం వలన, ఆ వర్గాలన్నీ పై 5 శాతం గుప్పిట్లో వున్నాయని నేను విశ్వసిస్తున్నాను.

ఇదే 'వేతన శర్మ' లో సూచాయగా శాస్త్రి గారు ప్రస్తావించినట్లయితే, ఆయన మీద నా గౌరవం యినుమడిస్తుంది.

"పని హక్కు" ను, గుర్తించి జనతా పార్టీ అభివృద్ధి పథం చూపింది. కానీ ఏడాది తిరిగినా ఆ వైపు ఒక్క అడుగు వేయ్యలేదు. కాగా ప్రణాళికా సంఘం అది కుదరని పని అని చెప్పి అభివృద్ధి పెరిగేదాకా వాయిదా వెయ్యమన్నది. జనతా ప్రభుత్వం అదే పనిచేస్తూంది. ముప్ఫైయ్యేళ్ళు కాంగ్రెసు చేసిన పనే జనతా ఖురఖాలో కొనసాగుతోంది, మధ్యలో జనం ఎప్పుడూ మోసపోతునేఉన్నారు. ఇటువంటివి చూచిన తర్వాత అనిపించేది ఏమిటి? వ్యవస్థ – సమ్మెలు చర్చలు, విజయాలు ఇవన్నీ తెలియ చేస్తున్న పొరపాట్లు కావు. ఎన్నికల వాగ్దానాలు–విజయాలు – మద్దతులు – ప్రజల క్షేమంకని చేస్తున్న పనులుకావు. కలవారి పెత్తనాన్ని కొనసాగించే దృష్టిలో రావాలని వ్యూహంతో వేస్తున్న పథకాలు. అందుకునే అన్ని పార్టీలు, వర్గాలు, యూనియన్లు కలవారి ఆధిపత్యం కొనసాగింపుకి తోడ్పడే విధంగా తయారు అమ్మాయి అనడం,

"ప్రజల సమస్యలు తీరేదాకా అభివృద్ధి పెరుగుదలకు జరిగే కృషి (!) లో భారం, బాధ

అడుగు జనం వంతు. పైతరగతి వారు అంత వరకు అనుభవించినంతయినా బాధపడవలసిన అవసరం లేని స్థితి'', ఈ రెండు వ్యవస్థకి లక్షణాలు, వాటినికాదని అభివృద్ధి కృషిలో చేసే త్యాగం — బాధ అందరూ సమానంగా పంచుకోవలసిన అవసరం సృష్టించనంతవరకూ విప్లవం అన్న (అహింసతోనూ, ప్రజాస్వామ్య పద్ధతిలోనే అనండి) పదం వాడకూడదు మనం. ఈ అవసరం నొక్కి చెప్పకుండా ఏపార్టీ చేసినా ఏయూనియన్ చేసినా ఆ ఉద్యమం విప్లవానికి వ్యతిరేకమే. వేతనశర్మలు పార్టీల్ని, ఈయూనియన్లని నడుపుతున్నవాళ్ళే. విప్లవాత్మకమైన మూలవిధానంలో మార్పు ప్రజాసామ్యంలో వస్తుందని విశ్వాసం ఉన్నవాళ్ళు ఆ రకమైన నిజాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పకతప్పదు. సాహిత్యంలో అందుకే అందరికీ ''తాననుకొన్నది,'' చెప్పే హక్కు.

సి. పి. ప్రసాద్ — మద్రాసు

ఏప్రిల్ సంచిక – కొన్ని సలహాలు

పేజీలెక్కువయి నందుకు ('అభ్యుదయ' ఏప్రిల్ సంచిక) సంతోషం. మీరు 60, 64 పేజీల వరకు ఎక్కువ చేసే అవసరం కొద్ది కాలంలోనే పడుతుందని నానమ్మకం. ఇందులో విషయ వైవిధ్యం వుంది. ఇంకా ఉండాలి. మొత్తం సాంస్కృతిక రంగాన్ని ఆకళించుకొనేటట్టు చెయ్యాలని నా ఉద్దేశం. గోర్కీ, వల్లథోల్ మీది వ్యాసాలు బాగున్నాయి. అలాగే వర్క్‌షాప్ గురించి సమాచారం సమగ్రంగా వుంది. పద్మరాజుగారి ఏకాంకిక వ్యాసంలో వాసిరెడ్డి, సుంకర పేర్లు పేర్కొనక పోవడ శోచనీయం. వీరేశలింగంగారికి జరిగిన అపచారాన్ని గురించి వున్న వ్యాసం బాగుంది, మిగతా అన్యాయాలను కూడ చూపడం అవసరం. వీళ్ల తరువాత మళ్ళీ 'గబ్బిలం' ప్రసక్తి చదివాను. బాగుంది. జాషువా చాలా విస్మరింపబడిన కవి. మీ మద్రాసు శాఖ జరిపే చర్చల రిపోర్టులు చాలా యిన్‌ఫర్మేటివ్‌గానూ, ఎడ్యుకేటివ్‌గానూ వుంటున్నాయి. సాహితీరంగంలో తెలుగునాట జరిగే ముచ్చటలు ముద్రించడం మీ ప్రత్యేకత. ఉదా॥ ఈ సంచికలో కాకినాడ 'సాహిత్యలహరి' గోష్ఠి. ఇటువంటి రిపోర్టులు చాలా అవసరం. తెలుగులో వస్తున్న డిటెక్టివ్ నవలలూ, రేషనలిష్టు సాహిత్యం మీద సవిమర్శకమైన వ్యాసాలు అవసరం. రేషనలిజం ప్రచారం చేస్తూ బ్రాహ్మణా బ్రాహ్మణ వైరుధ్యాలను పెంచుతున్న సాహిత్యాలని విస్మరించకూడదు.

ఒక పాఠకుడు — ఢిల్లీ

మార్చి సంచిక

టి. ప్రసన్నకుమార్ గారికవిత ''పెద్ద నోట్ల రద్దు'' సంచికకి తలమానికం ''చర్చావేదిక'' ''రచయిత పరిపక్వత'', 'రేపటి నవల' గురించి నేటి సమాలోచన'' యువ రచయితలందరికీ ఉపయుక్తంగా వుండేవిగ ఉన్నాయి కొందరు ప్రవాసాంధ్రుల సంస్కారాన్ని కళ్లకి కట్టినట్లుగ చెప్పారు ''సంస్కారం'' కథానికలో డా॥ ఎ. విజయలక్ష్మిగారు. ''ఫిల్మోత్సవ్ – 78 : ఒక సమాలోచన'' వ్యాసం నాకు బాగా నచ్చింది. ప్రేక్షకుల అభిరుచిని గురించి వ్రాసిన వాక్యాలు. అక్షరలక్షలు ఖరీదుచేసే వాక్యాలు. అటువంటి అభిరుచులు ఏర్పడివుండగా, ఉన్నతమైన అభిరుచులు కలిగించడానికి మార్గం ఏదైనావుందా? ఉంటే ఏమిటది? ఈ అంశంమీద చర్చావేదికలో చర్చిస్తే ఉపయోగంగ ఉంటుందని ఆశిస్తా.

మ రా శాస్త్రి — రూర్కెలా


సాహిత్య గోష్ఠి

మే నెల 7 తేదీ (ఆదివారం)

నా రచనకు ప్రేరణ

పొట్టి శ్రీరాములు స్మారక మందిరం లజ్‌లో. సాయంత్రం 6 గంటలకు.

ABHYUDAYA May 1978 Regd. No. TN. MS. (c) 289



Edited and Published By T. Venkataramiah, at 15, Arulammal Street, Madras - 600 017 and Printed at Sri Venkateswara Printers, Madras - 600021.